


# విజయభాను




విశాఖపట్నం, ఆదివారం 04-08-2019 VIJAYABHANU DAILY * VISAKHAPATNAM సంపుటి : 42 సంచిక : 282 పేజీలు : 8 వెల : 1 రూపాయి

# జలవిలయం



రాజమహేంద్రవరం: అంతకంతకూ పెరుగుతున్న వరదతో గోదావరి ఉగ్రరూపం దాల్చుతోంది. తూర్పు గోదావరి జిల్లా దేవీపట్నం, పోచమ్మగండి, పోడిపల్లి, తొయ్యూరు, పోలవరం మండలాల్లోని 400 గ్రామాలు జలదిగ్బంధమయ్యాయి. ధవళేశ్వరం బ్యారేజీ 175 గేట్లను పూర్తిగా ఎత్తి నీటిని సముద్రంలోకి వదులుతున్నారు. బ్యారేజీకి ప్రస్తుతం 9.34 లక్షల క్యూసెక్కుల వరద వస్తుండగా...9.27 లక్షల క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి వదులుతున్నారు. ఆనకట్ట వద్ద ప్రస్తుతం 11.2 అడుగుల మేర ఉన్న నీటిమట్టం ఉండటంతో సాయంత్రానికి మొదటి ప్రమాద హెచ్చరిక స్థాయికి చేరుకునే అవకాశముందని అధికారులు అంచనా వేస్తున్నారు.

వశిష్ఠ, వైనతేయ, గౌతమి పాయలు ఉద్ధృతంగా ప్రవహిస్తుండటంతో తూర్పుగోదావరి తరువాయి 2లో..

## గోదారి ఉధృతిపై సీఎం ఆరా



గోదావరి వరద ఉధృతిపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరా తీశారు. ఉభయ గోదావరి జిల్లాల్లోని ప్రస్తుత పరిస్థితులపై ఆయన సమాచారం కోరారు. సీఎం కార్యాలయ అధికారులు.. ఇజ్రాయెల్ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రికి ఉభయ గోదావరి ప్రాంత పరిస్థితులను వివరించారు. అధికారులు తరువాయి 2లో..

- దిగ్బంధంలో 400 గ్రామాలు
- మరబోట్లపై రాకపోకలు
- స్తంభించిన జనజీవనం
- సురక్షిత ప్రాంతాలకు ప్రజల తరలింపు
- ధవళేశ్వరం బ్యారేజీ పూర్తిగా ఎత్తివేత
- తెలంగాణలో నిండు కుండల్లా జలాశయాలు
- భద్రాచలంలో ఒకటో నెం. ప్రమాద హెచ్చరిక
- కొనసాగుతున్న సహాయక చర్యలు

### కార్యకర్తలెప్పుడూ

## నిత్య విద్యార్థులే

- బిజెపి.. ఓ ఆర్గానిక్ సంస్థ
- యంపీల రెండు రోజుల శిక్షణా కార్యక్రమాలు
- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ




న్యూఢిల్లీ : భారతీయ జనతా పార్టీ సహజంగా ఎదిగిన వ్యవస్థ అని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. ఇది అతుకుల బొంత కాదన్నారు. ఆ పార్టీ తరువాయి 2లో..

## శతమానంభవతి..

### బిశ్వభూషణ్ జన్మదిన శుభాకాంక్షలు



అమరావతి: ఏపీ రాజ్‌భవన్‌లో గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. గిరిజన సంక్షేమ బాలబాలికల సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. గవర్నర్‌కు తిరుమల తరువాయి 2లో..

## ఛత్తీస్‌గఢ్‌లో తుపాకుల మోత



రాయ్‌పూర్: ఛత్తీస్‌గఢ్‌లో మరోసారి తుపాకుల మోత మోగింది. రాజ్‌నంద్‌గావ్ జిల్లా సీతాగోటా అటవీ ప్రాంతంలో భద్రతా బలగాలు, నక్సలైట్లకు మధ్య శనివారం ఉదయం ఎదురుకాల్పులు చోటు చేసుకున్నాయి. ఈ ఘటనలో ఏడుగురు నక్సల్స్ హత తరువాయి 2లో..

### గిరిజన విద్యార్థుల సమస్యలు

## తక్షణమే పరిష్కరించండి

### పుష్పశ్రీవాణి హెచ్చరిక

విజయనగరం : గిరిజన విద్యార్థుల వసతి గృహాల్లో భోజన సదుపాయం కానీ, మౌలిక సదుపాయాల కల్పన కానీ సక్రమంగా అమలు చేయకపోతే సంబంధించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఉపముఖ్యమంత్రి, గిరిజన శాఖ మంత్రి పుష్పశ్రీవాణి హెచ్చరించారు. శనివారం ఆమె గిరిజన విద్య, వైద్యంపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గిరిజనుల సంక్షేమానికి, విద్యకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారన్నారు. గిరిజన విద్య కోసమే రాష్ట్ర బడ్జెట్‌లో రూ. 1245 కోట్లు తరువాయి 2లో..

# భూదందా సాగనివ్వం

### ఎవరికీ బెదిరేది లేదు ఎంతటి వారైనా శిక్షార్హులే

### జగన్ ఆశయాలు నెరవేర్చాలి

### వైసీపీ పార్లమెంటరీ పార్టీ నాయకుడు వి. విజయసాయిరెడ్డి



విశాఖపట్నం: విశాఖ భూకబ్జాలపై ఉక్కు పాదం మోపుతామని వైసీపీ పార్లమెంటరీ పార్టీ నాయకుడు వి. విజయసాయిరెడ్డి హెచ్చరించారు. ఈ విషయంలో తమ ప్రభుత్వం ఎవరికీ బెదరదని, భూ కుంభకోణాలలో ఎంతటి పెద్దవారున్నా శిక్షలు తప్పవని స్పష్టం చేశారు. విశాఖ జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జిల్లా సమీక్షా సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సంద ర్భంగా హాజరైన విజయసాయిరెడ్డి మాట్లాడుతూ, విశాఖ జిల్లాలో భూ ఆక్రమణలపై గతంలో సిట్ వేశారని, ఆ నివేదికలో ఏముందో చూసి మరీ బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు. ఇంతవరకు జిల్లా సమీక్షా సమావేశాలు ఉంటాయని విషయం తనకు తెలియదని సెటైర్లు వేశారు. గత మూడేళ్లలో సమావేశానికి హాజరు కావడం ఇదే మొదటిసారి అని అన్నారు. గతంలో ఎప్పుడు తనను ఆహ్వానించలేదని ఆయన చెప్పారు. కాగా, అభివృద్ధి విషయంలో పార్టీలకతీతంగా ముందుకు వెళ్లాలని ఆయన సూచించారు. విశాఖ కేంద్రంగానే రైల్వే జోన్ కొనసాగించాలని,తే తరువాయి 6లో..




### 2021 ఆఖరుకల్లా

## పోల'వరమందిస్తాం'

### ఏపీ జలవనరుల శాఖ మంత్రి అనిల్ కుమార్ యాదవ్



నెల్లూరు: పోలవరం నిర్మాణ పనులు నవంబర్ 1 నుంచి ప్రారంభిస్తామని ఏపీ జలవనరుల శాఖ మంత్రి అనిల్ కుమార్ యాదవ్ స్పష్టంచేశారు. పోలవరం పనులకు సంబంధించి టెండర్లు రద్దు చేయడం ద్వారా ప్రాజెక్టు మరింత ఆలస్యమవుతుందన్న విమర్శలపై ఆయన తరువాయి 2లో..



# గోపాల మిత్రలను సచివాలయపోస్టులలో వెటర్నరీ అసిస్టెంట్లుగా తీసుకోవాలి

## గోపాల మిత్రల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు - కిల్లాడ వెంకటరమణ



విశాఖలో నిరసన కార్యక్రమంలో పాల్గొన్న గోపాల మిత్రలు

చోడవరం : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం త్వరలో ఉద్యోగ నియామకాలు జరపనున్న గ్రామ సచివాలయ పోస్టు లలో గోపాల మిత్రలను తీసుకోవాలని గోపాలమిత్రల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు కిల్లాడ వెంకటరమణ అన్నారు. గోపాలమిత్రల సమస్యలు పరిష్కరించా లంటూ విశాఖ జి.వి.ఎం.సి, సెంట్రల్ పార్కు మహాత్మా గాంధీ విగ్రహం వద్ద రెండవ రోజు శనివారం నిరసన కార్యక్రమం కొనసాగించారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షులు వెంకటరమణ మాట్లాడుతూ జిల్లా విశాఖపట్నం పశు గణాభివృద్ధి సంఘంలో గత 20 ఏళ్ళగా సేవలందిస్తున్నామని, ప్రభుత్వం ప్రకటించిన గ్రామ సచివాలయ ఉద్యోగ నియామకాలలో పశు సంవ ర్ధక శాఖ తరపున వెటర్నరీ అసిస్టెంట్ పోస్టులు ప్రకటించిందని, ఈ నియామకాలలో గోపాల మిత్రలకు అవకాశం కల్పించాలని ఏ.పి. పశుగణాభివృద్ధి సంస్థ సంచాలకులు, ముఖ్య కార్య నిర్వహణాధికారిని కోరారు. ఇప్పటికే సంబంధిత అధికారులను కోరడం జరిగిందన్నారు.ప్రభుత్వం సంబంధిత అధికారులు గోపాల మిత్రల సేవలు గుర్తించి తమకు ఇన్ సర్వీస్ అర్హత కల్పించి, వెటర్నరీ అసిస్టెంట్ ఉద్యోగం కల్పించాలని, లేదంటే పశు సంవర్ధక శాఖలో ఆఫీస్ సబార్డినేట్లుగా నియమించాలని ఈ సందర్భంగా కోరారు.అలాగే ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి ప్రజా సంకల్ప యాత్రలో ఇచ్చిన హామీ మేరకు గోపాల మిత్రలకు నెలకు 16 వేల 500 వేతనం అమలు చేయాలని, ఉద్యోగ భద్రత ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు మళ్ల రాము, ఈర్లె నాయుడుబాబు, పండూరి సూర్య ప్రకాష్, ఆర్లి వెంకట సన్యాసిరావు, రుత్తల దొరబాబు, అమల కంఠ అప్పారావు, ఆళ్ల వరహా నాగేశ్వరరావు, కిల్లాడ సన్యాసినాయుడు, వి.కొండలరావు, సరిసా కృష్ణ అప్పారావు, చోడవరం, సబ్బవరం, దేవరాపల్లి, కె.కోటపాడు మండలాలకు చెందిన గ్రామీణ గోపాల మిత్రలు తదితరులు పాల్గొన్నారు.

# మరో స్వాతంత్ర్య పోరాటానికి సిద్ధం కండి

## ఏఐసిసి కార్యదర్శి శైలజానాథ్



విజయనగరం : బీజేపీ ఆర్ఎస్ఎస్ కలిసి దేశ స్వతంత్ర్యం, సేచ్ఛ నాశనం చేసే పరిస్థితి దాపురించిందని దేశాన్ని రక్షించేందుకు మరో స్వాతంత్ర్య పోరాటం చేయాలని ఏఐసిసి కార్య దర్శి శైలజానాథ్ పిలుపునిచ్చారు. శుక్రవారం రాత్రి డిసిసి కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ విస్తృత సమావేశం డిసిసి అధ్యక్షులు యడ్ల ఆదిరాజు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా శైలజానాథ్ మాట్లాడుతూ వైఎస్ఆర్ పార్టిని, జగన్ ప్రభుత్వాన్ని విమర్శించే పరిస్థితి లేదని, అది బిజెపి, ఆర్ఎస్ఎస్ భావజాలంతో ఏర్పాటు అయినవని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ కార్య క్రమాలు ప్రజలను మోసం చేసే విధంగా ఉన్నా యని మోడి చేతిలో జగన్ ఒక రిమోట్‌లా పనిచేస్తున్నారని అతని సొంత నిర్ణయాలు లేవని అన్నరు.

ఒక్క కాంగ్రెస్ పార్టీయే దేశాన్ని ప్రజలను కాపాడగలదని ఉద్ఘాటించారు. ఈ సమావేశంలో శ్రీకాకుళం డిసిసి అధ్యక్షులు డోల జగన్మో హనరావు, పిసిసి ప్రధాన కార్యదర్శి మార్టిన్ లూథర్, జిల్లా పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యుత్ కొరత నివారించండి : ఎమ్మెల్యే కోలగట్ల



విజయనగరం : నగరంలో విద్యుత్ కొరత ఏర్పడకుండా చూడాలని విద్యుత్ అధికారులను ఎమ్మెల్యే వీరబధ్రస్వామి ఆదేశించారు. స్థానిక దాసన్నపేటలో ఉన్న విద్యుత్ ఎస్సీ కార్యా లయంలో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. విజయనగరం పట్టణంలో మూడు విద్యుత్ సబ్ స్టేషన్లు మంజూరు అయ్యాయని నిర్మాణ దశలో ఉన్నాయని అవి త్వరితగతిన పూర్తిచేస్తే విద్యుత్ సరఫరకు ఏ ఆటంకం ఉండదని అన్నారు. సోనియానగర్‌లో కూడా 225 విద్యుత్ స్టేషన్ మంజూరు అయిం దని తెలిపారు. వినియోగ దారులకు ఎక్కడ అవసర ముందో అక్కడ ట్రాన్స్ ఫార్మలు ఏర్పాటు చేయడం జరుగు తుందని, థర్డ్ వైర్ ఏర్పాటు చేసి సమస్యలు పరిష్క రించాలని అధికారులను ఆదేశించారు.

విద్యుత్ అధి కారులు వినియోగ దారులతో సమన్వయం కావా లని కోరారు. ఈ సమావేశంలో విద్యుత్ అధి కారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# సైకిల్‌పై తిరుపతికి బయలుదేరిన నలుగురు యువకులు



విజయనగరం : స్థానిక బొందులగూడెంకు చెందిన నలుగురు యువకులు సైకిల్‌పై తిరు పతి యాత్రకు బయలుదేరారు. దారి మధ్యలో పచ్చదనం..పరిశుభ్రత..ఆరోగ్య అవగాహన కార్యక్రమాలను గ్రామాల్లో వివరిస్తూ ఈ యాత్ర సాగుతుందని తెలిపారు. యాత్రలో సైకిల్‌పై వెళ్ళిన వారిలో..ఎస్.కె.గౌస్, కె.కళ్యాణ్ సింగ్, టి.తిరుపతి, సిహెచ్.అశోక్ ఉన్నారు. సమాఖ్య తకు నిదర్శనంగా మా స్నేహం కొనసాగుతున్నా దని.. మత సామరస్యతను చాటేందుకు మిత్రులు గౌస్, సింగ్ కూడా వస్తున్నారని తెలిపారు. ముందుగా బొంఇదిలిగూడెంలో ఉన్న శ్రీవినాయకుని ఆలయం నుంచి శనివారం ఉదయం వీరు బయలుదేరారు.

# శ్రీక్షేత్రమ్‌లో లక్ష పసుపుకొమ్ముల పూజ



విజయనగరం : ప్రముఖ భారతీయ తత్వదర్శన కేంద్రం శ్రీక్షేత్రమ్‌లో కొలువైయున్న అష్టలక్ష్మీ సమేత ఐశ్వర్య వేంకటేశ్వర స్వామి దేవాలయంలో శ్రావణమాస ఉత్సవాలలో భాగంగా దేవా లయంలో జరిగిన లక్ష పసుపుకొమ్ములపూజలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. దేవాలయం ప్రధాన అర్చకులు చామర్తి రమేష్ ఆచార్యులు, భద్రం విద్యాసాగర్ ఆచార్యుల ఆధ్వర్యంలో మహిళలకు సకల సౌభాగ్యాల కోసం ఉచి తంగా ఏర్పాటు చేసిన ఈ పూజ ఎంతో భక్తిశ్రద్ధలతో సాగింది. ఈ సందర్భంగా దేవాలయం ధర్మకర్త దుర్గాబాలాజీ మాట్లాడుతూ వరలక్ష్మీ వ్రతం నాడు జరిగే సువర్ణ పుష్పార్చనలోను,మూడవ శుక్రవారంనాడు జరిగే సామూహిక కుంకుమార్చనలోను భక్తులు పాల్గొనాల్సిందిగా కోరారు.

# జ్ఞాన సరస్వతి ఆలయంలో శ్రావణ మసోత్సవాలు



విజయనగరం : స్థానిక శ్రీజ్ఞాన సరస్వతి మాత ఆలయంలో కొలువై వున్న శ్రీమహాలక్ష్మి సహిత శ్రీజ్ఞానసరస్వతి, శ్రీభువనేశ్వరి అమ్మవారకి శ్రావణమాసోత్సవ సందర్భంగా ప్రత్యేక కుంకు మార్చనలు, పూజలు నిర్వహించారు. సామూహికంగా మహిళలు శ్రీమహాలక్ష్మి సహస్రనామ పారాయణలు చేశారు. శ్రీశారదాసేవా సంఘం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి.

# ఇసుక తరలింపు అనుమతులు రద్దు - సబ్ కలెక్టర్ చేతన్

విజయనగరం : జిల్లాలోని పార్వతీపురం డివిజన్‌లో వివిధ మండలాల్లో ఇసుక రీచ్‌ల నుండి ఇసుక తరలింపు కోసం గతంలో జారీచేసిన 340 అనుమతులను రద్దు చేశామని సబ్ కలెక్టర్ టి.ఎస్.చేతన్ తెలిపారు. ఆయా రీచ్‌ల నుండి ఇసుక తరలింపుకు అనుమతించవద్దని తహసిల్దార్లను ఆదేశించారు. గనులు, భూగర్భ శాఖ సహాయ సంచాలకుల నుండి అందిన నివేదిక ఆధారంగా ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. బొబ్బిలి మండలం పారాది, కొరాడ, కొమరాడ మండలం గుమడ, కళ్లికోట, సీతానగరంలోని పెదభోగిలి, సాలూరులో పెద హరిజనవాడ, ప్రభుత్వ ఆసుపత్రి రోడ్ నెలిపర్తి, గుమడాం, పెదవీధి, ఆర్.బి.పురంలో కొట్టక్కి, గొల్ల పేట, తెర్లాం లోని కుసుమూరు, బలిజిపేటలో నారాయణ పురం, గరుగుబిల్లిలో ఉల్లిబధ్ర ఇసుకతరలించే అనుమతులకు ఏలాంటి సిఫారుసు చేయవద్దని తెలిపారు. ఆయా రీచ్‌లో తగినంత ఇసుక లేదని అలాగే నీరుచేరడంతో అనుమతులు రద్దుచేశామని తెలిపారు.

# బైలంపూడి సినిమా విజయవంతం - డైరెక్టర్ పల్లా అనిల్



సబ్బవరం : సినిమా పరిశ్రమలో ఒకరిపై ఆధారపడకుండా స్వయంకృషితో డైరెక్టర్ అయ్యానని ఇటివల విజయవంతమైన బైలంపూడి సినిమా డైరెక్టర్ పల్లా. అనిల్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని స్థానిక ఆర్ అండ్ బి అతిథి గృహంలో శనివారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నేను సబ్బవరం మండలంలోని ఒక చిన్న గ్రామమైన చిన గొల్లలపాలెం గ్రామంలో పుట్టి పెరిగి ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఇంటర్ మీడియట్ చదివానన్నారు. సినిమాలపై చిన్ననాటి నుండి ఆసక్తితో తన సోదరుడు సహకారంతో హైదరాబాద్ రామోజీ ఫిలిమ్‌సిటీలో చేరి పలు సినిమాలకు ముందుగా అసిస్టెంట్ కెమెరామెన్ గా పని చేశారన్నారు. 2004 సంవత్సరంలో వి.ఎస్.ఆర్ స్వామి కాంబినేషన్‌లో అడవి రాముడు, నర్తనశాల సినిమాలలో అసిస్టెంట్ కెమెరామెన్‌గా చేశానన్నారు. పెద్ద ప్రొడ్యూసరు నన్ను పిలిచి అసిస్టెంట్ కెమెరామెన్ గా పనిచేసిన అనుభవంతో ఈ బైలంపూడి సినిమాకి డైరెక్టర్ గా చేసి విజయవంతం అయింది అని అన్నారు తాను డైరెక్ట్ గా తీసిన మొదటి సినిమా విజయవంతం కావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. భవిష్యత్తులో మరిన్ని సినిమాలు చేసేందుకు అవకాశాలు వస్తున్నాయని అన్నారు. తక్కువ బడ్జెట్ తో ఒకే షెడ్యూల్లో కేవలం 30 రోజుల్లో ఒక కోటి 20 లక్షలు వ్యయంతో విశాఖ జిల్లాలోని సినీ నిర్మాణం పూర్తి చేశామన్నారు. ఈ సినిమాలో నటీనటులందరూ కొత్తవారు కావడం విశేషం అన్నారు. ఇంత విజయానికి సహ కరించిన ప్రొడ్యూసర్‌లకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పల్లా తాతారావు, రోమాల దేముడు, జి.నారాయణరావు, జి సంజీవ్, కె.ప్రేమకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి

# జలవిలయం

జిల్లా దేవీపట్నం మండలంలో 26కు పైగా ఏజెన్సీ గ్రామాలు జలదిగ్బంధమయ్యాయి. పి.గన్నవరం మండలం చాలకలి పాలెం సమీపంలో కాజ్‌వే నీట మునిగింది. నాలుగు రోజులుగా కరకాయ లంక ప్రజలు అవస్థలు పడుతున్నారు. బూరుగు లంక, హరిగెలవారిపేట, జి.పెదపూడి లంక, అయోధ్య లంక, అనగారిలంక వాసులు మరబోట్లపై రాకపోకలు సాగిస్తున్నారు. గండిపోచమ్మ అమ్మవారి విగ్రహం వద్ద 2 అడుగుల మేర వరద నీరు నిలిచింది. దీంతో హుండీలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు.

చాలా ప్రాంతాల్లో అరటితోటలు నీట మునగడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దేవీపట్నం, తొయ్యూరు రహదారిపై 4 అడుగుల మేర ప్రవాహ ఉద్ధృతి నెలకొంది. లంకగ్రామాలను అప్రమత్తం చేసిన అధికారులు ముంపు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. మరోవైపు పశ్చిమగోదావరి జిల్లాలోనూ గోదావరి ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. వరదతో పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే మునిగిపోయింది. స్పిల్‌వే మీదుగా 2 మీటర్ల మేర నీరు ప్రవహిస్తోంది. కాఫర్ డ్యాం వద్ద వరద ప్రవాహం 28 మీటర్లకు చేరుకుంది. పోలవరం మండలంలోని 19 గ్రామాలకు వారం రోజులుగా రాకపోకలు స్తంభించాయి. వేలేరుపాడు మండలం ఎద్దువాగుకు వరద చేరడంతో 14 గ్రామాలు జలదిగ్బంధమయ్యాయి.

### తెలంగాణలో నిండు కుండల్లా జలాశయాలు

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో తెలంగాణలోని కాళేశ్వరం ప్రాజెక్టుకు భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. బ్యారేజీలు, పంపుహౌజ్‌ల వద్ద జలాశయాలు నిండు కుండలను తలపిస్తున్నాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవ్‌పూర్ మండలంలోని మేడిగడ్డ, అన్నారం బ్యారేజీ గేట్లను తెరిచి ఉంచారు.

మేడిగడ్డ బ్యారేజీ వద్ద 12వ నెంబర్ నుంచి 75 వరకు గేట్లను పైకెత్తారు. మొత్తం 5.87 లక్షల క్యూసెక్కుల వరద వస్తుండగా.. అంతే మొత్తాన్ని దిగువకు వదులుతున్నారు.

అన్నారం జలాశయం పూర్తి స్థాయి జలకళను సంతరించుకుంది. బ్యారేజీ నీటి మట్టం 119 మీటర్లు కాగా.. శుక్రవారం మధ్యాహ్నానికే నిండింది. అన్నారం బ్యారేజీలో 9 గేట్లను ఎత్తివేశారు. బ్యారేజీలోకి 34,774 క్యూసెక్కుల వరద నీరు వస్తుండగా..36 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. భారీ వర్షాలకు ఎగువ నుంచి వరద ప్రవాహం పెరిగి జలాశయం నిండు కుండను తలపిస్తోంది. 5 రోజుల నుంచి కన్నెపల్లి పంపుహౌజ్ వద్ద పంపులు నిలిచిపోయాయి. మేడిగడ్డ బ్యారేజీ వద్ద 4.51 టీఎంసీలు, అన్నారం వద్ద 9.25టీఎంసీలు, కన్నెపల్లి పంపుహౌజ్ వద్ద 8 టీఎంసీల నీటి నిల్వ ఉంది.

నిర్మల్ జిల్లా కడెం జలాశయంలోకి భారీగా వరదనీరు వచ్చి చేరుతోంది. 4 గేట్లు తెరిచి 39 వేల క్యూసెక్కుల నీటిని దిగువన ఉన్న గోదావరిలోకి వదులుతున్నారు. కడెం జలాశయం పూర్తి స్థాయి నీటిమట్టం 700 అడుగులు కాగా..ప్రస్తుతం 695 అడుగులుగా ఉంది. పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 7.6 టీఎంసీలు కాగా..ప్రస్తుతం 5.5 టీఎంసీల నిల్వ ఉంది. కడెం నుంచి వస్తున్న నీటితో ఎల్లంపల్లి జలాశయంలో నీటిమట్టం పెరుగుతోంది.

### భద్రాచలంలో ఒకటో నెంబరు ప్రమాద హెచ్చరిక

మరోవైపు ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరదనీరు గోదావరిలోకి వచ్చి చేరుతుండటంతో భద్రాచలంలో క్రమంగా వరద ఉద్ధృతి పెరుగుతోంది. భద్రాచలంలో నీటి మట్టం 43 అడుగులకు చేరింది. స్నాన ఘట్టాల మీదుగా వరద నీరు ప్రవహిస్తుండటంతో అధికారులు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు.

భద్రాచలం, చర్ల, దుమ్ముగూడెం, బూర్గంపాడు మండలాల్లోని లోతట్టు ప్రాంతాల ప్రజలకు పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. చత్తీస్‌గఢ్ నుంచి భారీగా వరద నీరు వచ్చి చేరుతుండటంతో తాలిపేరు జలాశయం ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. జలాశయం 34 గేట్లను ఎత్తివేసి 1.34 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

# గోదారి ఉద్ధృతిపై సీఎం ఆరా

ఎప్పటికప్పుడు నివేదికలు పంపిస్తున్నారు. సీఎం జగన్ ముంపు గ్రామాల్లో చేపడుతున్న సహాయక చర్యలను అడిగి తెలుసుకుంటున్నారు. బాధితులను రక్షిత ప్రాంతాలకు తరలించి వారికి భోజనం సహా అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

# కార్యకర్తలెప్పుడూ నిత్య విద్యార్థులే

ఎంపీలకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బీజేపీ అనేది ఓ ఆర్గానిక్ సంస్థ అని, అసెంబుల్డ్ ఎంటిటీ కాదని మోదీ చెప్పారు. మంత్రులుగా, ఎంపీలుగా మారిన తర్వాత కూడా క్షేత్రస్థాయిలో కార్యకర్తలుగా చురుగ్గా ఉండాలని కోరారు. బీజేపీ తన సిద్ధాంతాల వల్ల ఈ స్థాయికి చేరిందన్నారు.

ఒక కుటుంబ ఔన్నత్యం వల్ల ఎదిగిన పార్టీ కాదన్నారు.

మీరు ఎంపీ అయినా, మంత్రి అయినా, మీలోని బీజేపీ కార్యకర్త ఎల్లప్పుడు సజీవంగా ఉండాలి. నేర్చుకునే ప్రక్రియ కొనసాగించడానికి వీలుగా మీ వయసుతో సంబంధం లేకుండాఎల్లప్పుడు విద్యార్థిగా ఉండండి అని మోదీ చెప్పారు.

బీజేపీ ఎంపీలకు రెండు రోజులపాటు జరిగే శిక్షణ కార్యక్రమాలు శనివారం ప్రారంభమయ్యాయి.

# శతమానంభవతి

తిరుపతి, విజయవాడ కనకదుర్గమ్మ దేవస్థానాలకు చెందిన వేదపండితులు ఆశీర్వచనం చేశారు. పుట్టిన రోజు సందర్భంగా చిన్నారులకు నూతన వస్త్రాలు, నోట్ పుస్తకాలను గవర్నర్ పంపిణీ చేశారు.

### సీఎం జగన్ శుభాకాంక్షలు

ఆంధ్రప్రదేశ్ గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ పుట్టిన రోజు సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హార్దిక శుభాకాంక్షలు తెలిపారు. దేవుడి ఆశీస్సులతో కలకాలం ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని కోరుకున్నారు. గవర్నర్ హరిచందన్ తన 85 పుట్టినరోజు వేడుకలను గిరిజన, దళిత చిన్నారులతో జరుపుకున్నారు. పలు ప్రజాహిత కార్యక్రమాలు నిర్వహించారు. శనివారం ఉదయం తిరుమల తిరుపతి దేవస్థానం, కనకదుర్గమ్మ దేవస్థానం వేదపండితులు ఆయనకు ఆశీర్వచనం అందించారు.

అనంతరం గిరిజన, దళిత బాలబాలికల సమక్షంలో కేక్ కట్ చేసి నిర్వహించి, చిన్నారులకు నూతన వస్త్రాలు, నోట్ పుస్తకాలు అందించారు. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం తరపున గవర్నర్‌కు మంత్రులు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. మంత్రులు కొడాలి నాని, పేర్ని నాని, వెలంపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు తదితరులు గవర్నర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలియచేశారు.

### శుభాకాంక్షలు తెలిపిన చంద్రబాబు

గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్‌కి తెలుగుదేశం అధినేత చంద్రబాబు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

ఈ మేరకు ట్విటర్‌లో పోస్టు చేశారు. పూర్ణాయుష్కులై, సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని ఆకాంక్షించారు. తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ కూడా గవర్నర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. భగవంతుడు ఆయనకు సంపూర్ణ ఆయురారోగ్యాలు ప్రసాదించాలని, కలకాలం సుఖశాంతులతో జీవించాలని కోరుకున్నట్లు లోకేశ్ ట్వీట్ చేశారు.

# 2021 ఆఖరుకల్లా పోల'వరమందిస్తాం'

స్పందించారు. ఈ మేరకు నెల్లూరులో శనివారం మీడియాతో మాట్లాడారు. పోలవరంలో దోపిడీ నిర్మూలన కోసమే రివర్స్ టెండరింగ్‌కు వెళ్తున్నామని చెప్పారు. ప్రభుత్వ చర్యలతోనే పోలవరం ఆలస్యమవుతోందనడంలో అర్థం లేదని వ్యాఖ్యానించారు. సెప్టెంబర్ వరకు పోలవరంలో ఎలాంటి పనులూ జరగవని స్పష్టంచేశారు.

సెప్టెంబర్ నాటికి టెండర్లకు సంబంధించిన వ్యవహారాలను పూర్తి చేసి కొత్త గుత్తేదారులకు పనులు అప్పగిస్తామని తెలిపారు. పారదర్శకంగా పనులు చేపట్టి 2021 ఆఖరుకల్లా ఈ బహుళార్ధ సాధక ప్రాజెక్టును పూర్తి చేస్తామని చెప్పారు.

# గిరిజన విద్యార్థుల సమస్యలు తక్షణమే పరిష్కరించండి

కేటాయించిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అని ప్రశంసించారు. గిరిజన వసతి గృహాల్లో ంఉన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

# ఛత్తీస్‌గఢ్‌లో తుపాకుల మోత

నిరోధక చర్యల్లో హతమయ్యారు. నక్సల్స్ కాల్పుల్లో భాగంగా.. డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్ (డీఆర్‌జీ) ప్రత్యేక దళాలు గాలింపు చర్యలు చేపట్టాయి. ఈ క్రమంలో దుండగులు భద్రతా సిబ్బందిపైకి కాల్పులు జరపడంతో.. ఎదురుకాల్పులు ప్రారంభించారు.

దీంతో ఏడుగురు నక్సల్స్ అక్కడికక్కడే హతమయ్యారు. ఘటనా స్థలిలో భారీగా పేలుడు సామగ్రి, ఆయుధాలు స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం డీఆర్‌జీ దళం, నక్సల్స్ మధ్య ఎదురుకాల్పులు కొనసాగుతున్నట్లు సమాచారం. గత నెల 27న ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ జిల్లాలో స్పెషల్ టాస్క్ ఫోర్స్ (ఎస్టీఎఫ్) సిబ్బంది, మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో ఏడుగురు నక్సల్స్ మృతి చెందిన విషయం తెలిసిందే.

అలాగే 29న జరిగిన కాల్పుల్లో మహిళా నక్సలైట్ సహా ఇద్దరు హతమయ్యారు.

# వర్కింగ్ జర్నలిస్టుల చట్టం రద్దుపై పార్లమెంట్‌లో ప్రస్తావిస్తా

- దశలవారీగా జర్నలిస్టుల సమస్యలు పరిష్కరిస్తాం
- ఎంపి విజయసాయిరెడ్డితో వీజేఎఫ్ కార్యవర్గం



విశాఖపట్నం : వర్కింగ్ జర్నలిస్టుల చట్టం రద్దు అంశం విషయంపై తాను పార్లమెంట్‌లో ప్రస్తావించడం జరుగుతుందని, ఇందుకు గల అన్ని కారణాలు తెలుసుకొని జర్నలిస్టులకు అండగా వుంటామని ఢిల్లీలో ఎపి ప్రభుత్వ అధికార ప్రతినిధి, ఎంపి విజయసాయిరెడ్డి హామీ ఇచ్చారు. శనివారం వైజాగ్ జర్నలిస్టుల ఫోరం అధ్యక్షులు గంట్ల శ్రీనుబాబు ఆధ్వర్యంలో కార్యవర్గం విజయసాయిరెడ్డిని అయన నివాసంలో కలుసుకొని పలు పెండింగ్ అంశాలను వివరించారు. వర్కింగ్ జర్నలిస్టుల చట్టం రద్దు చేయడం మంచిది కాదని దీని వలన దేశ వ్యాప్తంగా లక్షలాది మంది జర్నలిస్టులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం వుందని ఎంపికి తెలియచేశారు. అంతే కాకుండా ఈ చట్టం రద్దుకు కేంద్రం ప్రయత్నిస్తే జర్నలిస్టులు ఆందోళనలకు వెనకాడబోరని ప్రస్తావించారు.

వైజాగ్ జర్నలిస్టుల ఫోరంనకు గతంలో హామీ ఇచ్చిన విధంగా లిఫ్టును త్వరలో మంజూరు చేస్తామని విజయసాయిరెడ్డి స్పష్టం చేశారు. వీజేఎఫ్ కార్యదర్శి ఎస్ దుర్గారావు, ఉపాధ్యక్షులు ఆర్ నాగరాజ్‌పట్నాయిక్, జాయింట్ సెక్రటరీ దాడి రవికుమార్‌లు పలు అంశాలను విజయసాయి రెడ్డి వద్ద ప్రస్తావించారు. అనంతరం అప్పన్న చిత్రపటాన్ని బహుకరించి సత్కరించారు. కార్యక్రమంలో కార్యవర్గసభ్యులు ఇరోతి ఈశ్వరావు, ఎంఎఎస్ఆర్ ప్రసాద్, పైలా దివాకర్, పి. వరలక్ష్మి, ఎస్ డేవిడ్ రాజు తదితర్లు పాల్గొన్నారు.

# విల్లూరి చిన్నతల్లి ఛారిటబుల్ ట్రస్ట్ విద్యార్థులకు పుస్తక వితరణ



అక్కయ్యపాలెం: గ్రేటర్ విశాఖ 28వ వార్డు పరిధిలో విల్లూరి చిన్నతల్లి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని 28వ వార్డులో వున్న మూడు ప్రభుత్వ పాఠశాలలు అనగా ఎం.జి.ఎం. హైస్కూల్., సి.బి.ఎం. అప్పర్ ప్రైమరీ స్కూల్ మరియు అల్లిపురం న్యూప్రైమరీ స్కూలు విద్యార్థినీ విద్యార్థులకు నోట్ బుక్స్, పెన్నులు, పెన్సిళ్లు, రబ్బర్లు, బిస్కెట్ పేకెట్స్ పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన విల్లూరి చినతల్లి చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ విల్లూరి డాక్టర్ చక్రవర్తి 200 మంది విద్యార్థినీ విద్యార్థులకు పంపిణీ చేయడం జరిగింది. అన్ని దానాల కన్నా విద్యాదానం గొప్పది అన్న స్ఫూర్తితో విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్సిల్స్, పెన్లు, రబ్బర్లు ఉ చితంగా పంపిణీ చేయడం ద్వారా విద్యావ్యాప్తికి నావంతుగా దోహదపడుతున్నానని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ఎం.జి.ఎం. హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఎం.వెంకట లక్షణ్, సి.బి.ఎం. అప్పర్ ప్రైమరీ స్కూల్ ఉపాధ్యాయిని జాస్మిన్, అల్లిపురం న్యూప్రైమరీ స్కూల్ ప్రధాన ఉపాధ్యాయిని కె.అరుణలక్ష్మి మరియు ఎం.వి.వి.ఎస్.మూర్తి మహిళా సంక్షేమ సంఘం అధ్యక్షురాలు విల్లూరి తిరుమల దేవి, సీనియర్ తెలుగుదేశం నాయకులు దాసన సత్యనారాయణ, అత్తిలి శంకరరావు, జపురుల్లా, పైజర్ రెహ్మాన్, జి.సత్య, మాధవి, గైరమ్మ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# డెలాయిట్‌కు 37 మంది గీతం విద్యార్థుల ఎంపిక

## ప్రాంగణ నియామకాలలో శుభారంభం

## రూ.7.2 లక్షల వార్షిక వేతనంతో ఆఫర్లు




సాగర్‌నగర్: ప్రముఖ బహుళజాతి ఐటి సంస్థ డెలాయిట్ తెలుగు రాష్ట్రాలలో మొదటి సారిగా గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం నుంచి అత్యధిక సంఖ్యలో 37 మంది ఇంజనీరింగ్ విద్యార్థులను ప్రాంగణ నియామకాలలో ఎంపిక చేసుకుంది. సాధారణంగా కఠిన వడపోత పరీక్షలను నిర్వహించి పరిమిత సంఖ్యలోనే విద్యార్థులకు అవకాశం కల్పించే డెలాయిట్ సంస్థ గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం నుంచి ఇంతటి పెద్ద సంఖ్యలో విద్యార్థులను ఎంపిక చేసుకోవడం విశేషమని ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ అధికారి కమాండర్ గురుమూర్తి గంగాధరన్ తెలిపారు. విద్యార్థులకు ఆన్‌లైన్ పరీక్షతో పాటు కేస్ స్టడీ అనాలసిస్, టెక్నికల్ రౌండ్, హెచ్ ఆర్ రౌండ్ వంటి దశల ద్వారా పలు వడపోతల అనంతరం డెలాయిట్ ఈ ప్రాంగణ నియామకాలను ప్రకటించిదని ఆయన వెల్లడించారు.

ఎంపికయిన విద్యార్థులకు ఆఫర్ చేసిన ఉద్యోగాలు కూడా ఎప్పుడూ విననివిగా ఉన్నాయి. ఇంజనీరింగ్ చదివిన విద్యార్థులకు సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు లభిస్తాయని భావించడం సాధారణ విషయం, అయితే డెలాయిట్ సంస్థ ఆఫర్ చేసిన ఉద్యోగాలు పేర్లు యుఎస్ఐ రిస్క్ అండ్ ఫైనాన్షియల్ అడ్వయిజరీ, డెలాయిట్ యుఎస్ఐ ఆడిట్, గ్లోబల్ డెలాయిట్ అప్లికేషన్ స్టూడియో (జి-డాస్) గా ఉన్నాయి.. ఎంపికయిన 37 మంది విద్యార్థులకు రూ.7.2 లక్షల రపాయల వార్షిక వేతనంతో పాటు ఈ ఏడాది డిసెంబర్‌లో శీతాకాలపు ఇంటర్న్‌షిప్‌ను డెలాయిట్‌కు ఆఫర్ చేయిడం గమనార్హం.విద్యార్థులు ఉద్యోగాలలో చేరడానికి ముందే నెలవారీ స్టైఫండ్‌ను అందుకుంటూ కార్పోరేట్ వాతావరణానికి అలవాటు పడటానికి ఈ ఇంటర్న్‌షిప్ ఉపయోగపడుతుంది.

కాగా ఎంపికయిన విద్యార్థులను గీతం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె.శివరామకృష్ణ, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె.వి.జి.డి.బాలాజీ తదితరులు అభినందించారు.

# మోడీ కార్మిక వ్యతిరేక విధానాలు నశించాలి

## అఖిలపక్ష కార్మిక సంఘాల డిమాండ్




విశాఖ సిటీ: నరేంద్ర మోడీ అనుసరిస్తున్న కార్మిక, ఉద్యోగ వ్యతిరేక విధానాలను నశించాలని, కార్మికచట్టాల కుదింపు, కార్మిక హక్కుల తొలగించడాన్ని నిరశిస్తూ శనివారం విశాఖ నగరంలో అఖిలపక్ష కార్మికసంఘాల ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన జరిగింది. ఈ ప్రదర్శన సరస్వతీపార్కు నుండి డాబాగార్డెన్స్, అంబెద్కర్‌విగ్రహం, ఆర్టీసి కాంప్లెక్స్, ఆశీల్‌మెట్ట మీదుగా జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద చేరుకుంది. అనంతరం బహిరంగసభ జరిగింది.

ఈ సభనుద్దేశించి సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.నరసింగరావు, ఐఎన్‌టియుసి రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.ఎస్.మోహన్‌కుమార్‌లు మాట్లాడుతూ రెండవసారి కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు లాభాలు చేకూర్చేవిధంగా కార్మిక చట్టాలను కుదించాలని, కార్మిక హక్కులను తొలగించాలని కుట్రపన్నుతోందని, ఈ బిల్లు వల్ల కార్మికులు, ఉద్యోగులకు ప్రస్తుత చట్టాలలో ఉన్న హక్కులను, భద్రతను కల్పిస్తున్న నిబంధనలు తొలగించి ఉన్న హక్కులు బలహీనపడతాయని పేర్కొన్నారు.

నరేంద్రమోడీ ప్రభుత్వం ప్రభుత్వరంగ పరిశ్రమలను 100 రోజుల్లో ప్రయివేటీకరించాలని నిసిగ్గుగా ప్రకటించింది. అసంఘటితరంలో పనిచేస్తున్న కార్మికులకు, స్కీం వర్కర్లకు ఉద్యోగభద్రత, కనీసవేతనాలు, పిఎఫ్, ఇఎస్ఐ వంటి చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేసారు. .

# ప్రభుత్వ పథకాలకు తెలుపు రేషన్ కార్డు తప్పనిసరి కాదు ...

- టీపీడీఎస్ ఉత్తర్వు బేఖాతరు చేస్తున్న అధికారులు
- జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకోవాలి
- రాష్ట్ర విజిలెన్స్ కమిటీ సభ్యుడు వెంకటరమణ



సబ్బవరం : ప్రభుత్వ పథకాలకు తెలుపు రేషన్ కార్డు తప్పనిసరి కాదు ... ఈ విషయాన్ని ఆంధ్రప్రదేశ్ వినియోగదారుల వ్యవహారాలు, పౌరసరసరఫరాల శాఖ రాష్ట్ర లక్షిత వ్యవస్థ (టీపీడీఎస్) నియంత్రణ ఉత్తర్వు (జీవో ఎంఎస్ నెం.15 తేది : 1-8-2018లో 15 ఎఫ్)లో స్పష్టంగా ప్రభుత్వం పేర్కొన్నా చాలా మంది అధికారులు సంక్షేమ పథకాలకు తెల్ల రేషన్ కార్డు తప్పనిసరంటూ పేదలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ విజిలెన్స్ కమిటీ సభ్యుడు, జిల్లా వినియోగదారుల సంఘాల సమాఖ్య అధ్యక్షుడు కాండ్రేగుల వెంకటరమణ ఆరోపించారు. తక్షణం జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. శ్రీ దుర్గమాంబ భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో శనివారం జరిగిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. కొనుగోలు చేసిన ప్రతి వస్తువుకు రశీదు తీసుకోవాలన్నారు. తప్పుదోవ పట్టించే ప్రకటనల విషయంలో ప్రకటకర్తలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వినియోగదారుల ఫోరాల్లో కేసులు దాఖలు చేయడానికి న్యాయవాది అక్కరలేదన్నారు. వైద్యులు, కల్తీ విత్తనాలు, ఎరువులు విక్రయదారులు కూడా వినియోగదారుల చట్టం పరిధిలోకి వస్తారన్నారు. ప్రతి ఒక్కరూ ప్రజా సాధికార సర్వేలో తమ ఆధార్ నెంబర్‌ను తహశీల్ధార్ కార్యాలయానికి వెళ్లకుండా http://push83.sps.ap.gov.in/WEBEKY-COTP/EkycOTP_Auth.aspx లింక్‌పై క్లిక్ చేసి అనుసంధానం చేసుకోవాలన్నారు. ప్రభుత్వ పథకాలకు ఈ సర్వేలో ఆధార్ లింక్ తప్పనిసరన్నారు. విద్యా సంస్థల్లో చేరికలు, స్కాలర్ షిప్‌ల కొరకు తెలుపు రేషన్ కార్డు సరిపోతుందని, ఈ మేరకు రాష్ట్రప్రభుత్వ ఉత్తర్వు (రెవిన్యూ ఎస్ఇఆర్.11 డిపార్ట్‌మెంట్ జీవో ఎం.ఎస్.నెం. 229 తేది : 2316-2017) జారీ చేసిందన్నారు.

ఈ సందర్భంగా వినియోగదారుల హక్కుల రక్షణ చట్టం, సమాచార హక్కు చట్టం గురించి వెంకటరమణ వివరించారు.

శ్రీ దుర్గమాంబ భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు గోపి సత్యం అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శి గొంతిన అప్పారావు (చంటి), సహాయ కోశాధికారి పి.అప్పలనాయుడు, ఉపాధ్యక్షుడు బొండా వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భవన నిర్మాణ కార్మికులు, కార్పెంటర్లు పాల్గొన్నారు.

# స్వామివారిని దర్శించుకున్న ప్రముఖులు



సింహాచలం : శ్రీ వరాహలక్ష్మీనరసింహ స్వామివారిని శనివారం పర్యాటక శాఖా మంత్రి ముత్తంశెట్టిశ్రీనివాస్ మరియు ఎం ఎల్ సి శత్రుచర్ల విజయరామరాజు మొదులుగు ప్రముఖులు స్వామివారిని దర్శించుకున్నారు. సింహగిరి కి చేరుకున్న వీరికి ఆలయ అధికారులు సంప్రదాయం ప్రకారం స్వాగతం పలుకగా .బేడా ప్రదిక్షణ కప్పస్థంబ ఆలింగనం అనంతరం అంతరాలయంలో అర్చకస్వాములు వీరి గోత్రనామములతో ప్రత్యేక అర్చనలు చేసారు . అనంతరం లక్ష్మీ అమ్మవారి దర్శనం చేసుకున్నవీరికి ఆలయ వైదికులు వేద అశీర్వచనం పలుకగా ఆలయ ఏ ఈ ఓ పులి రాము స్వామివారి చిత్రపటం ప్రసాదములు అందజేశారు.

## ఏపీలో పరిణామాలు ఆందోళనకరం: సుజనా

దిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న పరిణామాలు కొంత ఆందోళనకరంగా ఉన్నాయని భాజపా ఎంపీ సుజనా చౌదరి అన్నారు. పోలవరం కాంట్రాక్టు రద్దు చేయడం ప్రాజెక్టుకు ఎంతో నష్టమని అభిప్రాయపడ్డారు. ఏదైనా తప్పులు ఉంటే సరిదిద్దుకుని ముందుకెళ్లాలే తప్ప పనులు ఆపేయడం సరికాదన్నారు. దీనివల్ల అభివృద్ధి ఆగిపోయినట్లైందని ఆయన వ్యాఖ్యానించారు.

దిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పనులు కొనసాగిస్తూనే మరోవైపు ఆడిట్ చేసి చర్యలు తీసుకోవాల్సిందని అభిప్రాయపడ్డారు.

# నియోజక వర్గ సమస్యలను సమావేశం దృష్టికి సభ్యులు తీసుకురావాలి



విశాఖపట్నం: జిల్లాలోని నియోజక వర్గాలకు సంబంధించి సమస్యలను సమావేశం దృష్టికి తీసుకు రావాలని జిల్లా ఇన్ చార్జ్ మరియు రాష్ట్ర పశు సంవర్ధక, మత్యశాఖ మరియు మార్కెటింగ్ శాఖామాత్యులు మోపిదేవి వెంకట రమణారావు పేర్కొన్నారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జిల్లా సమీక్షా సమావేశంను శనివారం ఇన్ చార్జ్ మంత్రి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సమావేశం విశిష్టత ప్రాధాన్యత తెలిసిన సభ్యులుగా, గ్రామ పరిపాలన ప్రక్షాలన చేసి సచివాలయ వ్యవస్థను ముఖ్యమంత్రి ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ముఖ్యమంత్రి ఆశయాలకు అనుగుణంగా పాలన ఉండాలన్నారు. రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక మరియు క్రీడలు, యువజన సర్వీసుల శాఖామాత్యులు ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ అవినీతి లేని పాలన అందించాలని, సుపరిపాలన అందించాలని చెప్పారు. ఎస్.సి., ఎస్.టి., బి.సి., మైనారిటీలకు రిజర్వేషన్లు ద్వారా ఉద్యోగాలు కల్పన జరిగిందన్నారు. రాజ్యసభ సభ్యులు వి. విజయసాయి రెడ్డి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టలాన్నారు. తొట్లకొండలో పోలీసు అధికారులు మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టినట్లు ఆయన చెప్పారు. బీచ్ లో కొబ్బరి చెట్టు నాటడం చాలా బాగుందని అందుకు వాటిని నాటిన రాజబాబుని ఆయన అభినందించారు. జిల్లాకు సంబంధించిన రాష్ట్ర లేదా కేంద్ర రహదారులకు సంబంధించిన సమస్యలు ఏమైనా ఉంటే తెలపాలన్నారు. వ్యవసాయ శాఖ జాయింట్ డైరక్టర్ మల్లిఖార్జునరావు మాట్లాడుతూ వ్యవసాయ శాఖకు సంబంధించి ప్రగతిని వివరించి కౌలు రైతులను గుర్తించి వారికి ఋణాలు ఇవ్వనున్నట్లు చెప్పారు. మంత్రి మాట్లాడుతూ సంబంధిత రైతు పేరున సర్టిఫికేట్ జారీ చేయాలని ఆర్డిఓకి చెప్పారు. జిల్లా కలెక్టర్ వి. వినయ్ చంద్ మాట్లాడుతూ జిల్లాలో ఉన్న కౌలు రైతులకు కార్డులు జారీ చేస్తామని చెప్పారు. అనకాపల్లి పార్లమెంటు సభ్యులు డా.బి. వెంకట సత్యవతి మాట్లాడుతూ సేంద్రీయ విధానంలో పంటలు పండించుటకు సలహాలు, సూచనలు ఇవ్వాలని అడుగగా సేంద్రీయ విధానం గూర్చి వ్యవసాయ శాఖ జె.డి. వివరించారు. చోడవరం శాసన సభ్యులు కరణం ధర్మశ్రీ మాట్లాడుతూ నియోజక వర్గంలో రహదారుల గూర్చి అడుగగా దీనిపై కేంద్రమంత్రితో మాట్లాడనున్నట్లు విజయ సాయిరెడ్డి చెప్పారు. యలమంచి శాసన సభ్యులు కన్నబాబు రాజు మాట్లాడుతూ గతంలో భూ ఆక్రమణలపై సిట్ వేశారని దానిని బహిర్గం చేయాలని చెప్పగా దీనిపై ఒక కమిటీ వేసినట్లు ఇన్ చార్జ్ మంత్రి చెప్పారు. విశాఖ దక్షిణ శాసన సభ్యులు వాసుపల్లి గణేష్ కుమార్ మాట్లాడుతూ ఫిషింగ్ హార్బర్ ను రీ సర్వే చేయాలని, చుట్టూ గోడ నిర్మించాలని చెప్పగా వి.ఎం.ఆర్.డి.ఎ. అధ్యక్షులు ద్రోణంరాజు శ్రీనివాసరావు మాట్లాడుతూ మత్యకారుల పట్ల ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని, వారికి డీజిల్ లో సబ్సిడి, తదితర వాటిపై సబ్సిడి ప్రభుత్వం ఇస్తున్నట్లు చెప్పారు. పాయకరావుపేట శాసన సభ్యులు గొల్ల బాబూరావు మాట్లాడుతూ హాస్పిటల్ లో సిబ్బంది డెప్యుటేషన్ వెల్లిపోయారని , చోడవరం శాసన సభ్యులు, నర్సీపట్నం శాసన సభ్యులు హాస్పిటల్స్ లో డాక్టర్లు గూర్చి అడిగారు. డెప్యుటేషన్లు తక్షణమే రద్దు చేయాలని ఇన్ చార్జ్ మంత్రి కలెక్టర్ ను ఆదేశించారు. శాసన మండలి సభ్యులు పివియన్ మాట్లాడుతూ కెజిహెచ్ పేరును మార్చాలని చెప్పారు. గిరిజన ప్రాంతాల్లో ఉన్న సమస్యలపై పాడేరు శాసన సభ్యులు కె. భాగ్యలక్ష్మి వివరించారు. డాక్టర్లు అందుబాటులో ఉండడం లేదని, రోడ్డు సౌకర్యం లేదని, సమాచార వ్యవస్థ లేదని, ఏరియా హాస్పిటల్ లో ప్రత్యేక డాక్టర్లు ఉండాలని పాడేరు శాసన సభ్యులు కె. భాగ్యలక్ష్మి తెలిపారు. దక్షిణ నియోజక వర్గంలో ఒక డెంగ్యూ కేసు నమోదైనట్లు చెప్పగా విఎంఆర్డిఎ అధ్యక్షులు ద్రోణంరాజు శ్రీనివాసరావు మాట్లాడుతూ హాస్పిటల్స్, విద్యా సంస్థలు బలోపేతం కావాలని, డెంగ్యూ ఫీవర్ వస్తే వెంటనే కలెక్టర్ చర్యలు తీసుకున్నట్లు వివరించారు. పశ్చిమ నియోజక వర్గం శాసన సభ్యులు, తూర్పు నియోజక వర్గం శాసన సభ్యులు వెలగపూడి రామకృష్ణబాబు, పెందుర్తి శాసన సభ్యులు అదీప్ రాజ్, తదితరులు మాట్లాడారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ వి. వినయ్ చంద్, పార్లమెంటు సభ్యులు ఎంవివి సత్యనారాయణ, డా. బి.వి. సత్యవతి, జి. మాధవి, శాసన మండలి సభ్యులు దువ్వారపు రామారావు, బుద్దా జగదీశ్వరరావు, పప్పల చలపతిరావు, వర్మ, జిల్లాకు చెందిన శాసన సభ్యులు వెలగపూడి రామకృష్ణబాబు, పివిజిఆర్ నాయుడు, వాసుపల్లి గణేష్ కుమార్, అదీప్ రాజ్, కన్నబాబు రాజు, తిప్పల నాగిరెడ్డి, గుడివాడ అమర్ నాథ్, కరణం ధర్మశ్రీ, పెట్ల ఉమా శంకర్ గణేష్, కె. భాగ్యలక్ష్మి, గొల్ల బాబూరావు, విఎంఆర్డిఎ కమీషనర్ కోటీశ్వరరావు,జాయింట్ కలెక్టర్ ఎల్. శివశంకర్, జివియంసి కమీషనర్ డా. సృజన, ఐటిడిఎ పిఓ డి.కె. బాలాజి, సబ్ కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్, జెసి-2 ఎం వెంకటేశ్వరరావు, డిఆర్ఓ శ్రీదేవి, ఎ.బి. శ్రీనివాసరావు, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యా వ్యవస్థను సమ్మేళనంగా

# ప్రక్షాళన చేయడమే ప్రభుత్వ ధ్యేయం

## -రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ రవిచంద్ర

దేవరాపల్లి : రాష్ట్ర ప్రభుత్వం ప్రతి పేదవాడికి నాణ్యమైన విద్యతో పాటు కార్పొరేట్ తరహాలో వసతులను కల్పిస్తూ ప్రతి పేద విద్యార్థికి ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్యను అందించేందుకు ఈ రాష్ట్ర ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తుందని రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ ముద్దాడ రవిచంద్ర అన్నారు.

మండలంలోని తెనుగుపూడి బాలయోగి గురుకుల కళాశాలలో శనివారం జరిగిన పూర్వపు విద్యార్థుల కలయికకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన తనతో కలిసి చదువుకున్న పూర్వపు విద్యార్థి ఎన్. ఉమామహేశ్వరరావు,ఏర్పాటు చేసిన ఈ సమావేశానికి కళాశాల ప్రిన్సిపల్ ఎస్. విక్టర్ పాల్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రవిచంద్ర మాట్లాడుతూ ,విద్యా వ్యవస్థను సమ్మేళనంగా ప్రక్షాళన చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోందని అలాగే ఉపాధ్యాయులు మరింత శ్రమించి విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని అలాగే గురుకులంలో గురువు ఉండాలి తప్ప కులం ఉండకూడదని ఆయన అన్నారు. అనంతరం కళాశాల ఆవరణంలో మొక్కలు నాటారు.వాతావరణం మార్పుల వలన చిరుజల్లులు పడడంతో విద్యార్థులతో ఎక్కువ సమయం గడపలేకపోతున్నానని మరింత తొందరలోనే మరలా మీ కళాశాలకు వస్తానని ఆయన అన్నారు.

అనంతరం పూర్వపు విద్యార్థులు ఆయనను కొంతమంది గురువులను ఘనంగా సన్మానించారు అనంతరం ఇటీవలి పది వ తరగతి ఫలితాలలో అద్భుత ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు మెమొంటోలను అందజేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. భోజనం చేస్తున్న సమయంలో విద్యార్థులను భోజనం రోజుకి ఇలాగే ఉంటుందా లేకుంటే భోజనంలో ఇబ్బందులు గానీ లేక చదువులో ఇబ్బంది గాని ఉపాధ్యాయులు వలన ఏమైనా ఇబ్బందులుగానీ ఉన్నాయా లేకుంటే ఉపాధ్యాయులు చక్కగా చెబుతున్నారా లేదా అన్న విషయాలను విద్యార్థులను నేరుగా అడిగి తెలుసుకున్నారు.

అనంతరం పూర్వపు విద్యార్థి ఎన్. ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ,డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ ఒక పేద కుటుంబానికి చెందిన వాడిని అయినప్పటికీ ఉన్నత చదువులు చదువుకుని మన దేశానికి కనీవిని ఎరుగని రీతిలో ప్రపంచమే గర్వించదగ్గ మహా అద్భుతమైన ఎటువంటి రాజ్యాంగాన్ని రాసిన మహనీయుడని అటువంటి పెద్దలను ఆదర్శవంతంగా తీసుకుని పేదరికం చదువుకు అడ్డుకాదని కొన్ని కొన్ని పౌరాణిక గ్రంథాలలోని కథలను చెప్పి విద్యార్థులను చైతన్యవంతులుగా తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులకు తెలియజేశారు. అలాగే ఖాళీ సమయంలో ఎక్కువగా పుస్తకాలు చదవడం వలన జ్ఞానము కలుగుతుందని తెలియజేశారు.

అనంతరం పోరుకు విద్యార్థులు తమ ఉపాధ్యాయులను సత్కరించి గురువుగారు మీరు నేర్పిన పాఠాల బోధన వల్లనే మేము ఇంత మంచిది ఉన్నత స్థాయికి ఎదిగామని గురుకులంలో గురువులే ఉండాలి తప్ప కులం ఉండకూడదని ఆయన అన్నారు.అలాగే మా పూర్వపు విద్యార్థుల మంతా ఈ కళాశాలను దత్తత తీసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ సెక్రెటరీ వి. రాములు , తదితర పెద్దలు పాఠశాల, కళాశాల, ఉపాధ్యాయుల బృందం ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

విజయభాను
సంపాదకీయం

## చట్టం చిక్కుల్లో విద్యార్థులు

గంపెడు ఆశలతో అమెరికాకు వెళ్ళిన వందలాది మంది మన దేశ విద్యార్థులు చట్టం చిక్కుల్లో చిక్కుకొని విలవిలలాడటం విషాదకరం. చట్టాన్ని అతిక్రమించారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న విద్యార్థుల్లో తెలంగాణ వారు కూడా భారీ సంఖ్యలో ఉన్నారు. చదువుకోవడానికి మాత్రమే అనుమతి పొందిన విద్యార్థులు, చదువు ముగిసిన తర్వాత స్వదేశం వెళ్ళకుండా, బోగస్ విద్యాసంస్థల్లో చేరి చట్టవిరుద్ధంగా కొనసాగుతున్నారనేది అమెరికా అధికారుల ఆరోపణ. ఈవిధంగా అక్రమంగా ఉంటున్నవారిని వల పన్ని పట్టుకోవడానికి అక్కడి అధికారులే ఒక బోగస్ విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటుచేసి, అందులో చేరినవారిని, చేర్పించినవారిని అరెస్టు చేస్తున్నారు. భారతీయ విద్యార్థుల ఫీజుల రూపంలో అమెరికాకు ఏటా ఆరు వందల కోట్ల డాలర్ల మేర ఆదాయం లభిస్తున్నది. అమెరికాకు భారత దేశంతో సౌహార్ద్ర సంబంధాలున్నాయి. భారతీయులు అమెరికా ఆర్థి క వ్యవస్థ బలోపేతానికి ఎంతో సేవలు అందించారు. ఇప్పుడు ఆరోపణలు ఎదుర్కొంటున్న విద్యార్థులు కూడా విద్రోహులో, ఉగ్రవాదులో కారు. పొట్ట పోసుకోవడానికి వచ్చిన విద్యార్థులపై మానవీయంగా వ్యవహరించడం అమెరికా బాధ్యత. అమెరికాలో బోగస్ విశ్వవిద్యాలయాలున్న మాట నిజం. అటువంటివాటిలో కొందరు విదేశీ విద్యార్థులు చేరుతున్నదీ నిజమే. ఈ అక్రమ పోకడల ను మార్గాలను అరికట్టాలంటే, అమెరికా అధికారులు చేయాల్సింది ప్రమాణాలు లేని విశ్వవిద్యాలయాలను అరికట్టడం. నిబంధనలను కఠినంగా అమలుచేయడం. కానీ బోగస్ విశ్వవిద్యాలయాన్ని నెలకొల్పి విద్యార్థులను ప్రలోభపెట్టి, శిక్షించడం ఎంతవరకు నైతికమనే ప్రశ్న తలెత్తుతున్నది. అమెరికాలో చట్టానికి చిక్కిన విద్యార్థులు తప్పు తెలిసి చేసినా ఏ పరిస్థితుల్లో చేశారనేది కూడా పరిగణనలోకి తీసుకోవాలె. సాధారణంగా అమెరికాకు భారతీయ విద్యార్థులు రుణం తీసుకొని వెళ్తారు. రెండేండ్ల చదువు తర్వాత ఉద్యోగానికి అనుమతి లభిస్తుందో లేదో తెలువదు. తీరా ఉపాధి వీసా లభించకపోతే మరో రెండేండ్ల కోర్సులో చేరి అక్కడే కొనసాగుతారు. ఫీజుల కోసం, బతుకడానికి కష్టాలు మొదలవుతాయి. ఇవన్నీ తమను ప్రేమతో పెంచిన తల్లిదండ్రుల కు కూడా చెప్పుకోలేని దయనీయస్థితి వారిది. కళాశాలలో చేరిన మొదటిరోజు నుంచే ఐచ్ఛిక ఆచరణాత్మక శిక్షణ (ఓపీటీ) లభించిందీ అంటే ఆ విశ్వవిద్యాలయంపై అనుమానం రావలిసిందే. కానీ అటువంటి విద్యాసంస్థ దొరుకడమే మహాభాగ్యంగా విద్యార్థులు భావిస్తారు. అక్కడి పరిస్థితిపై అందరికి పూర్తి అవగాహన ఉండదు. పల్లె నుంచి పట్నం పోయినా, అమెరికా తదితర దేశాలకు వెళ్ళినా వలసపోయిన వారి ఆలోచనాధోరణిపై తమకన్నా ముందువచ్చిన వారి అనుభవాల ప్రభావం ఉంటుంది. అమెరికా పాలకు లు తమకు చౌకగా శ్రమజీవులు కావాలనుకున్నప్పుడు, చట్ట విరుద్ధంగా ఉంటున్న వారిపట్ల, చదువుతూ ఉద్యోగాలు చేస్తున్న వారిపట్ల చూసీ చూడనట్టు వ్యవహరించారు. ఈ అనుభవాలె ఇక్కడినుంచి అనేకమంది యువతీ యువకులు అప్పుచేసి అమెరికా వెళ్ళడానికి ప్రేరణగా మారాయి. కానీ అమెరికా పాలకులు తమ అవసరం తీరిన తర్వాత నిబంధనలను కఠినంగా అమలుచేస్తున్నారు. ఈ విధానపరమైన మార్పు విద్యార్థుల నెత్తిపై పిడుగుపాటుగా మారింది. తల్లిదండ్రులు ఎంతో ప్రయాసపడి అమెరికాకు పంపిస్తే, ఉత్త చేతులతో తిరిగిరావడం విద్యార్థులకు బాధగానే ఉంటుంది. కానీ మెడపట్టి గెంటుతున్నప్పుడు, గౌరవంగా తిరిగివచ్చి స్వదేశంలో కానీ మరో దేశంలో కానీ తమ ప్రతిభా పాటవాలను ప్రదర్శించడమే ఉత్తమమైన మార్గమని న్యాయనిపుణులు సూచిస్తున్నారు. అమెరికాలో దిక్కుతోచకుండా ఉన్న విద్యార్థులను ఆదుకోవడానికి టీఆర్ఎస్ అనుబంధ విభాగం, కొన్ని ప్రవాస సంస్థలు చేస్తున్న కృషి అభినందనీయమైన ది. తెలంగాణ సమాజం కూడా వచ్చే విద్యార్థులకు నైతిక మద్దతు ఇవ్వాలె. తప్పయినా ఒప్పయి నా అమెరికా ప్రభుత్వం తన అవసరాలకు తగినట్టు తన విధానాలను అమలుచేస్తున్నది. కానీ మనం చేయవలసిందేమిటనేది కూడా ఆలోచించాలె. భారత ప్రభుత్వం ఇబ్బందుల్లో ఉన్న విద్యార్థులను ఈ సంక్షోభం నుంచి గట్టెక్కించడానికి తన శక్తిమేర కృషిచేయాలె. ఈ సమస్యను ఇక్కడితో వదిలేయకూడదు. కేంద్ర ప్రభుత్వం, భారతీయ సమాజం ఈ పరిస్థితులపై మరింత విస్తృత చర్చ జరుపాలె. ఒకప్పుడు వైద్యులు, ఆ తర్వాత ఇంజినీర్లు - ఇంకా భిన్నరకాల ఉన్నత విద్యావంతులను అమెరికా అవసరాలకు తగినట్టు తయారుచేయడం తప్ప మనకు గత్యంతరం లేదా అనేది నిపుణులు ఆలోచించాలె. యువతకు ఇతర దేశాలకు వెళ్ళవలసిన పరిస్థితులు ఎందుకు ఏర్పడుతున్నాయి?

# జిల్లా ప్రతిష్టను ఇనుమడింపచేయాలి

## రహదారులు, భవనాల శాఖా మంత్రి ధర్మాన కృష్ణ దాస్




శ్రీకాకుళం : టోర్నమెంటులో విజయం సాధించి, జిల్లా ప్రతిష్టను ఇనుమడింప చేయాలని రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి ధర్మాన కృష్ణ దాస్ క్రీడాకారులకు సూచించారు. శనివారం రాష్ట్ర స్థాయి సి. ఎం. వాలీ బాల్ టోర్నమెంట్ నిర్వహణపై జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో మంత్రి ధర్మాన కృష్ణ దాస్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులకు పుట్టినిల్లు శ్రీకాకుళం జిల్లా అని చెప్పారు. కోడి రామమూర్తి, కరణం మల్లీశ్వరి వంటి క్రీడాకారుల వలన జిల్లాకు మంచి పేరు ప్రతిష్టలు వచ్చాయని ఈ సందర్భంగా మంత్రి గుర్తు చేసారు. ఈ టోర్నమెంట్ ను క్రీడాకారులు ఒక ఛాలెంజ్ గా తీసుకుని ఆడాలని, జిల్లా పేరును నిలబెట్టాలని అన్నారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి, క్రీడాకారులకు అండగా వున్నారని మంచి క్రీడా స్ఫూర్తితో ఆడి. జిల్లా ప్రతిష్టను ఇనుమడింపచేయాలని మంత్రి తెలిపారు.

ఇది ఒక మంచి ప్రతిష్టాత్మక కార్యక్రమమని, 13 జిల్లాల క్రీడాకారులు ఈ టోర్నమెంట్ లో పాల్గొంటారని, అన్నివసతులు పక్కగా ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు. జిల్లాలో బాగా నిర్వహించి ఆదర్శంగా నిలవాలని, తద్వారా జిల్లా క్రీడలకు ప్రయోజనం కలగాలని మంత్రి చెప్పారు. అన్ని శాఖలు భాగస్వామ్యం వహించి సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని దిగ్విజయం చేయాలని అన్నారు. జిల్లా కలెక్టర్ జె.నివాస్ మాట్లాడుతూ, జిల్లాలో ఈ నెల 20,21,22 తేదీలలో ఎన్ టి ఆర్ నగర పాలక సంస్థ ఉన్నత పాఠశాల మైదానంలో సి.ఎం. వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు చెప్పారు. క్రీడాకారులకు మంచి భోజన, వసతి సౌకర్యాలను కలిగించాలని, గ్రౌండ్ ను పరిశు భ్రంగా తయారు చేయాలని ఆదేశించారు. ఆగస్టు 20 వ తేదీ ఉదయం 11 గం.లకు వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభోత్సవ కార్యక్రమం జరుగుతుందని, 21 వ తేదీన కేంపెయిన్, 22న ముగింపు కార్యక్రమాలు వుంటాయని కలెక్టరు తెలిపారు. డి.ఎస్.డి.ఓ. శ్రీనివాస కుమార్ మాట్లాడుతూ, ఆగస్టు 7వ తేదీన జిల్లా స్థాయి వాలీ బాల్ ఎంపిక జరుగుతుందని తెలిపారు. మహిళా క్రీడాకారులకు వసతి నిమిత్తం డా. వై.ఎస్.ఆర్. కళ్యాణ మండపాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఉదయం, సాయంత్రం రెండు పూటలా టోర్నమెంట్ నిర్వహించడం జరుగుతుందని,. అల్పాహారం, తేనీరు, భోజన సదుపాయాలను కలిగిస్తున్నట్లు చెప్పారు. సాప్ గైడ్ లైన్స్ ప్రకారం టీమ్స్ ఏర్పాటు చేస్తామని వివరించారు. ఈ కార్యక్రమానికి అసిస్టెంట్ కలెక్టర్ ఎ.భార్గవతేజ, జిల్లా రెవెన్యూ అధికారి కె.నరేంద్రప్రసాద్, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షులు సుందర రావు, వాలీబాల్ అసోసియేషన్ సెక్రటరీ పోలినాయుడు, పి.ఇ.టి.అసోసియేషన్ ప్రెసిడెంట్ సాంబమూర్తి, మోహన్ రావు, నగరపాలక సంస్థ సహాయ కమీషనరు దేవ్ కుమార్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి ఎం.చెంచయ్య, సెట్ శ్రీ సి.ఇ.ఓ. బి.వి.వి. ప్రసాదరావు, డిప్యూటీ డి.ఇ.ఓ. పగడాలమ్మ, డి.ఎస్.పి. ఎ. చక్రవర్తి, క్రీడా సంఘాల ప్రతినిధులు, తదితరులు హాజరైనారు.

# హెచ్ బి కాలనీ సమస్యల పరిష్కారంపై దృష్టి

## దేవాదాయ శాఖ మంత్రి వెలంపల్లి శ్రీనివాస్



విజయవాడ : హెచ్ బి కాలనీలో సమస్యలను పరిష్కరించడంతో పాటు ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు ప్రజలు సహకరించాలని దేవదాయ శాఖ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. శనివారం దేవదాయ శాఖ మంత్రి, హౌసింగ్ బోర్డ్ నగరపాలక సంస్థ అధికారులతో కలిసి హెచ్ బి కాలనీ లో పర్యటించారు.. ఈ సందర్భంగా కాలనీవాసులు పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. మెయిన్ రోడ్డు కన్న కాలనీ పల్లములో ఉండటం వల్ల కొద్దిపాటి వర్షానికి నీరు చేరి బయటకు రాలేని పరిస్థితి ఉందని, ఎల్. ఐ. జి , ఎమ్. ఐ. జి ప్రాంతంలో అయితే చెప్పనవసరం లేదని అన్నారు. అంతేకాకుండా ఈ ప్రాంతంలో సైడ్ కాలవలు లేక పోవడం వల్ల డ్రైనేజీ మురుగు పారుదల కు సరైన సదుపాయం బురదమయం అవుతుందని, దీనితో పలు ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నామని తెలిపారు... కాలనీలో ఉన్న ఖాళీ స్థలాల యందు పిచ్చి మొక్కలు పూర్తిగా పెరిగి పోవడంతో ఈ ప్రాంతములో పందులు స్వైర విహారం బాగా పెరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఖాళీ స్థలాల మధ్య ఉన్న పిచ్చి మొక్కలు వెంటనే తొలగించేందుకు చర్యలు చేపట్టాలని అధికా రులను ఆదేశించారు.

అంతేకాకుండా సైడ్ కాల్వల నిర్మాణం మరియు కాలనీలో మోహన్లాల్ చంద్ర బోస్ స్కూల్ ఖాళీ స్థలంలో మెరక చేయడంతోపాటు పాటు బాత్రూంలో మరమ్మతులను వెంటనే పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. పర్యటనలో హౌసింగ్ బోర్డ్ ఏఈ, నగర పాలక సంస్థ అధికారులు ఎమ్మార్వో సుగుణ, వై ఎస్ ఆర్ సి పి 28 వ డివిజన్ అధ్యక్షులు పి రమణారెడ్డి, బండారి వెంకట్, వంశి, నాగరాజు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# ఆ రోజులు చాలా దారుణంగా గడిచాయి

## ప్రపంచకప్‌లో ఓటమిపై టీమిండియా కెప్టెన్ కోహ్లీ

లౌడర్‌హిల్: ప్రపంచకప్‌లో టీమిండియా నిష్క్రమణపై కెప్టెన్ విరాట్‌కోహ్లీ స్పందించాడు. న్యూజిలాండ్ చేతిలో ఓటమి తర్వాత కొన్ని రోజులు దారుణంగా గడిచాయని, ఓటమిని జీర్ణించుకోవడం కష్టంగా మారిందని చెప్పాడు. ప్రపంచకప్ ముగిసేవరకూ నిద్రలేచిన ప్రతీ ఉదయం ఆ జరిగిన వాటికి చింతించకుండా ముందుకు సాగడంపై దృష్టి సారించామని తెలిపాడు. వెస్టిండీస్‌తో తొలి టీ20కి ముందు కోహ్లీ శుక్రవారం మీడియాతో మాట్లాడారు. వెస్టిండీస్ పర్యటనకు ధోనీ లేకపోవడంపై స్పందిస్తూ అతడి అనుభవం టీమిండియాకి ఎంతో అవసరమని పేర్కొన్నాడు. ధోనీ లేని లోటు యువ వికెట్‌కీపర్, బ్యాట్స్‌మన్ రిషబ్‌పంత్‌కు చక్కటి అవకాశమని కెప్టెన్ అభిప్రాయపడ్డాడు. మిడిలార్డర్‌లో పంత్ రాణించాలని, అతడికి వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటాడని కోహ్లీ ఆశాభావం వ్యక్తం చేశాడు. అందుకు పంత్ కూడా సిద్ధంగా ఉన్నాడని, లోయర్ మిడిలార్డర్‌లో పంత్ తన బ్యాటింగ్ సామర్థ్యాన్ని నిరూపించుకొని.. ధోనీ, పాండ్యలేని లోటును తీర్చాలని కోరాడు.

విండీస్ పర్యటనకు సెలక్టర్లు హార్దిక్‌పాండ్యకు విశ్రాంతినివ్వగా.. ధోనీ స్వతహాగా రెండు నెలలపాటు ఆటకు దూరమైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో యువ ఆటగాళ్లకు మంచి అవకాశం దొరికింది. వచ్చే ఏడాది జరిగే టీ20 ప్రపంచకప్ నేపథ్యంలో యువ క్రికెటర్లకు అవకాశమిచ్చామని కోహ్లీ పేర్కొన్నాడు.

# కొప్పర్తి రామారావు ట్రస్ట్ వ్యవస్థాపకులు రామారావు మృతి



నర్సీపట్నం : నర్సీపట్నం రామకృష్ణ మెడికల్స్ అధినేత, కొప్పర్తి రామారావు చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకులు కొప్పర్తి రామారావు శనివారం మృతి చెందారు. దీంతో పట్టణానికి చెందిన ప్రముఖులు రామారావు భౌతికకాయాన్ని సందర్శించి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకరగణేష్ నర్సీపట్నంలో లేకపోవడంతో ఫోన్‌లో కుటుంబానికి సంతాపం ప్రకటించారు. అదే విధంగా మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు, మాజీ నర్సపట్నం మున్సిపాలిటీ వైస్ చైర్మన్ చింతకాయల సన్యాసిపాత్రుడు(జమీలు) వచ్చి రామారావు భౌతికకాయాన్ని సందర్శించారు.

రామారావు మృతి పట్ల నర్సీపట్నంలోని మెడికల్స్ షాపు యాజమానులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

## ఆధార్ కేంద్రం మూసివేతతో ఇబ్బందులు

రావికమతం : రావికమతంతో పాటు మాడుగుల, బుచ్చెయ్యపేట మండల ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉండే రావికమతం ఆధార్ నమోదు కేంద్రం మూతపడటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం సంక్షేమ పథకాలు పొందాలన్నా, విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు మంజూరు కావాలన్నా, బ్యాంకు ఖాతా తెరవాలన్నా ఆధార్ లింక్ తప్పనిసరి అయింది. ప్రస్తుతం నెల రోజులుగా విద్యా వాలంటీర్లు, సచివాలయ ఉద్యోగాలకు దరఖాస్తులు చేసుకోవాలన్నా పలు ధృవపత్రాలకు ఈ సెంటర్‌తో ఎన్నో పనులు ముడి పడి ఉన్నాయి. స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో ఒక గదిలో ఈ సెంటర్ నడిచేది. 2013లో ఏర్పాటైన ఈ సెంటర్ నాలుగు నెలల క్రితం మూతపడింది. సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ కాకపోవడం, మరికొన్ని సాంకేతిక కారణాలు సాకుతో ఆధార్ సెంటర్ నిర్వాహకులు పాస్‌వర్డ్‌ను నిలిపివేశారు. రావికమతంతో పాటు సబ్బవరం, గొలుగొండ వంటి మరికొన్ని మండలాల కేంద్రాలు నిలిచిపోయాయి.

## టీడీపీ కార్యకర్తలు వైసిపిలో చేరిక

కోటవురట్ల : పాములవాక శివారు భీమిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన 50 మంది తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు వైసిపి నాయకులు, మాజీ ఎమ్మెల్సీ డివి.సూర్యనారాయణరాజు సమక్షంలో వైసిపిలో చేరారు. కోటవురట్ల మాజీ ఎమ్మెల్సీ కార్యాలయంలో భీమిరెడ్డిపాలెం గ్రామస్థులు 50 మంది పాములవాక మాజీ సర్పంచ్ కిల్లాడ శ్రీనివాసరావు, బూత్ కమిటీ కన్వీనర్ కిల్లాడ చినరామ్మూర్తినాయుడు సమక్షంలో వారు వైసిపిలో చేరారు. వారికి మాజీ ఎమ్మెల్సీ కుండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

## 18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరు ఓటు నమోదు చేసుకోవాలి

నాతవరం : 18 సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలని నాతవరం తహశీల్దార్ జి.శ్రీనివాస్ చెప్పారు. శనివారం తహశీల్దార్ కార్యాలయంలో బియల్‌ఓలతో సమావేశం నిర్వహించారు. గతంలో ఓటరుగా నమోదు చేసుకున్నవాళ్ల పేరులో తప్పులు ఉంటే వాటిని సరిచేయలన్నారు. అలాగే చనిపోయిన వారిని తొలగించాలని చెప్పారు. ఈ ప్రాంతం నుంచి వేరే ప్రాంతానికి వెళ్లి పోయినవారిని కూడా గుర్తించాలని చెప్పారు. ఆగస్టు నెలలో ఓటర్ జాబితా వెరైఫికేషన్, సెప్టెంబర్ నెలలో ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్‌ను పరిశీలన చేయాలన్నారు. అక్టోబర్ 15వ తేదీ నాటికి ఓటర్ జాబితాలో తప్పుల సవరణ చేయాలన్నారు.

## వరి నారుమళ్ల సందర్శన

గొలుగొండ : మండలంలోని లింగంపేట, చోద్యం తదితర గ్రామాల్లో శనివారం మండల వ్యవసాయాధికారి టి.మధుసూధనరావు వరి నారుమడులను సందర్శించారు. ఈ వరి నారుమడుల్లో పాడ తెగులు, జింఇక్‌దాతులోపములను గుర్తించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీని నివారణకు హెక్సాకొనజోల్ 2 ఎంఎల్ ఒక లీటరు నీటిలో కలిపి ఎకరానికి 200 లీటర్ల మందు ద్రావణం పిచికారీ చేయాలన్నారు. జింక్ దాతు లోపంకు ఎకరానికి 20కిలోల జింక్ సల్ఫేట్‌కు దమ్ములో వేయాలన్నారు.

# ఎన్టీఆర్ గృహ నిర్మాణాలను సత్వరమే పూర్తి చేసి లబ్ధిదారులకు అందించాలి

## మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు



నర్సీపట్నం : నర్సీపట్నం మున్సిపాలిటీలో నిలిచిపోయిన పలు ప్రాజెక్టులు రాష్ట్ర ప్రభుత్వం కొనసాగించాలని మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు కోరారు. శనివారం నర్సీపట్నం బలిఘట్టం వద్ద ఎన్టీఆర్ గృహ కల్ప నిర్మాణాలను సందర్శించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నర్సీపట్నం మున్సిపాలిటీలో ప్రధానమంత్రి గ్రామీణ ఆవాస్ యోజన(పిఎంఎవై) కింద సుమారు 72 కోట్ల వ్యయంతో ఎన్టీఆర్ గృహ కల్ప పేరుతో బలిఘట్టం, బయపురెడ్డిపాలెంలో 27 ఎకరాలలో నిర్మాణాలు చేపట్టామన్నారు. 80 శాతం నిర్మాణ పనులు పూర్తయ్యాయని, కానీ కొత్త ప్రభుత్వం ఏర్పాటుతో గృహ నిర్మాణాలు నిలిచిపోయాయన్నారు. సుమారు 3వేల మంది పేద, మధ్య తరగతి కుటుంబం గృహ అవసరాలు తీర్చడం కోసం ఈ ప్రాజెక్టు చేపట్టామన్నారు. మూడు విభాగాలుగా ఇక్కడ ఇల్లు నిర్మించారని చెప్పారు. 80 శాతం నిర్మాణం పూర్తయిందని, కేవలం 20 శాతం మాత్రమే పెండింగ్‌లో ఉందని, ఈ దశలో పనులు నిలిపివేయాలని టాటా కంపెనీకి అదేశాలు ఇవ్వడం అన్యాయమన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ప్రచార సభలో భాగంగా నర్సీపట్నం శ్రీకన్య కూడలి వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఎన్టీఆర్ గృహ నిర్మాణంలో లబ్ధిదారులు బ్యాంకు రుణాలు రద్దు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఆ హామీని నిలబెట్టుకోవాలన్నారు. అదే విధంగా నర్సీపట్నంలో పలు అభివృద్ధి పనులైనా నర్సీపట్నం పెద్ద చెరువు హైదరాబాద్ ట్యాంక్ బండ్ తరహాలో అభివృద్ధి చేయడానికి రూ.10కోట్లు విడుదల చేయడం జరిగిందన్నారు. ఇప్పటికే తారు రోడ్డు నిర్మాణం పూర్తయిందని, విగ్రహాలు, పార్కు, లైటింగ్ ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. ఈ ప్రాజెక్టు కూడా 60 శాతం పనులు పూర్తయ్యాయని, ఈ ప్రాజెక్టు పూర్తయితే నర్సీపట్నంకు కొత్త అందాలు సమకూరుతాయన్నారు.

వెంకటేశ్వరస్వామి గుడి దగ్గర నుండి పెదబొడ్డేపల్లి మీదుగా చోడవరం రోడ్డు వరకు మూడు కోట్లకు రోడ్ల నిర్మాణాంకు తెలుగుదేశం ప్రభుత్వంలో నిధుల విడుదల చేశామన్నారు. వెంటనే ఈ పనులు చేయాలన్నారు. నర్సీపట్నం ఏరియా ఆసుపత్రి ఎదురుగా మారుమూల గ్రామాల నుంచి వచ్చే వారికి అందుబాటులో ఉండే విధంగా అన్న క్యాంటీన్‌ను ఏర్పాటు చేశామన్నారు. అయితే కొత్తగా ఏర్పడిన వైఎస్సార్ ప్రభుత్వం పేదలకు, మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో ఉండే అన్న క్యాంటీన్‌లను ఆపివేయడం ఎంత వరకు సమంజసం అని అన్నారు. పేదలను మధ్యతరగతి వారి దృష్టిలో పెట్టుకొని అన్న క్యాంటీన్లను కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో అయ్యన్న యువసేన అధ్యక్షులు చింతకాయల విజయ్, మాజీ కౌన్సిలర్లు, టీడీపీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజాసాధికార సర్వేలో నమోదు తప్పనిసరి

రోలుగుంట : ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందాలంటే తప్పనిసరిగా ప్రజాసాధికారిక సర్వేలో నమోదు కావాలని తహశీల్దార్ ఎస్.లింగయ్య తెలిపారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ సంక్షేమ పథకాలు ప్రజలకు సక్రమంగా అందాలంటే సర్వేలో పేర్లు నమోదై ఉండాలన్నారు. నమోదు చేసుకోని వారు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎన్‌రోల్‌మెంట్ ఆపరేటర్ వద్ద తక్షణమే నమోదు చేసుకోవాలని సూచించారు.

# ఆరోగ్య కార్యకర్తకు పదోన్నతి

కోటవురట్ల : మండలంలోని బికెపల్లి ఆరోగ్య ఉప కేంద్రంలో ఏఎన్ఎంగా పని చేస్తున్న కమల్‌నెహ్రూకు హెల్త్ విజిటర్‌గా పదోన్నతి లభించింది.

ఈ మేరకు ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులను ఆమె స్వీకరించారు. హెల్త్ విజిటర్‌గా నాతవరం మండలంలోని మెయిన్ సెక్టార్‌కు వెళుతున్నారు.

ఈమె గతేడాది స్వాతంత్ర దినోత్సవం నాడు ఉత్తమ ఆరోగ్యకర్త అవార్డును పొందారు. రోగుల పట్ల ప్రేమ పూర్వకంగా మెలగి మెరుగైన వైద్య సేవలు అందిస్తారని ఈమెకు పేరుంది.

## ప్రజాసాధికార సర్వేలో పేర్లు నమోదు

యలమంచిలి రూరల్ : ప్రభుత్వ పథకాలు పొందేందుకు ప్రజాసాధికార సర్వేలో పేర్లు నమోదుకు ప్రజలు పడిగాపులు పడుతున్నారు. గత ప్రభుత్వం చేపట్టిన ప్రజాసాధికార సర్వేలో పూర్తి స్థాయిలో చేయకపోవడంతో చాలా మంది సర్వేలో వివరాలు నమోదు కాలేదు. దీంతో ప్రభుత్వ పథకాలకు వీరిని అనర్హులుగా అధికారులు చూపుతున్నారు. దీంతో తిరిగి సాధికార సర్వేలో తమ పేరును నమోదు చేయించుకునేందుకు ప్రజలు కార్యాలయాల చుట్టూ ప్రదక్షణలు చేస్తున్నారు. దీంతో యలమంచిలి రెవెన్యూ మున్సిపల్ కార్యాలయాలు నిత్యం సర్వే కోసం వచ్చిన వారితో కిటకిటలాడుతున్నాయి. ప్రతీ రోజు సుమారు 20 మంది సర్వే వివరాలు నమోదు చేస్తున్నట్లు సిబ్బంది పాల్గన్నారు.

రోజుకి రూ. 25/- మాత్రమే Size 1x3 Minimum 7 days విజయభాను క్లాసిఫైడ్స్ సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ : 2564353, 2569004

## చోడవరంలో పందులకు ఆవాసాలుగా మారుతున్న చెత్తకుప్పలు

**అపారిశుధ్యంతో ఇబ్బందులుపడుతున్న స్థానికులు**



**చోడవరం పట్టణం లక్ష్మిదేవి పేట చెత్తకుప్పల వద్ద సంచరిస్తున్న పందులు**

చోడవరం : చోడవరం పట్టణంలోని పలువీధులలో చెత్తకుప్పలు పేరుకుపోయి కుక్కలు, పందులకు ఆవాసాలుగా మారుతున్నాయి. గత రెండు రోజుల నుంచి కురుస్తున్న చిన్నపాటి వర్షానికి చెత్త కుప్పలు తీవ్ర దుర్వాసన వెదచల్లుతుండటంతో పాటు పందులు సంచరిస్తుండటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా ఆర్.టి.సి.కాంప్లెక్సు ఏరియా, దుడ్డువీధి, తామర చెరువు వీధి, లక్ష్మిదేవి పేట, యడ్లవీధి, కోటవీధి తదితర ప్రాంతాల పరిస్థితి మరింత ఇబ్బందికరంగా ఉంటుంది. సంబంధిత అధికారులు స్పందించి రోడ్లపై పేరుకుపోయిన చెత్త కుప్పలను తొలగించడంతో పాటు పందులను నిర్మూలించే చర్యలు చేపట్టాలని స్థానికులు పలువురు కోరుతున్నారు.

## స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ విద్యాసాగరరావుకు ఘనంగా సత్కారం



గాజువాక : విశాఖ ఉక్కు కర్మాగారం కార్యనిర్వాహక డైరెక్టర్ (వర్క్స్)గా నూతన బాధ్యతలను స్వీకరించిన సంధర్భంగా విద్యాసాగరావుకు డెమొక్రటిక్ స్టీల్ ఎంప్లాయిస్ యూనియన్ (హెచ్ఎంఎస్) ఆధ్వర్యంలో యూనియన్ నాయకులు శనివారం ఘనంగా సత్కరించారు. ఆయన కార్యాలయంలో నాయకులు కలిసి శాలువకప్పి, పుష్పగుచ్ఛానిచ్చి సత్కరించారు. ఈ సంధర్భంగా యూనియన్ నాయకులు బొండా ఎల్లాజీరావు మాట్లాడుతూ విద్యాసాగరరావు జూనియర్ మేనేజర్‌గా ప్లాంట్‌లో చేరి అంచెలంచెలుగా ఎదిగి కార్యనిర్వాహక డైరెక్టర్(వర్క్స్) గా పదవీ బాధ్యతలను స్వీరించడం చాలా ఆనందంగా ఉందని అన్నారు. ఆయన ఆద్వర్వర్యంలో సంస్థ మరింత అభివృద్ధి చెందుతుందని ఆశాభావాన్ని వ్యక్తం చేసారు. దీనికి యూనియన్ నుంచి సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు. ఇ.డి విద్యాసాగర్ మాట్లాడుతూ సంస్థ పురోగతికి సమిష్టి సహకారం ఎంతో అవసరమని అన్నారు. యూనియన్ ప్రతినిధులు, కార్మికులు, సంస్థ అధికారులకు సంపూర్ణ సహకారం అందిస్తే స్టీల్ ప్లాంట్ మరింత అభివృద్ధి చెందుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు పి.రామునాయుడు, శ్రీనివాసరావు, బొండా మహేష్, దొడ్డికనకరాజు, రామారావు, పి.గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## తల్లి పాలతో అనుబంధం

**- ఎమ్మెల్యే కోలగట్ల**



విజయనగరం : తల్లికి...బిడ్డకు అనుబంధం ఏర్పడటానికి కారణం తల్లి పాలు బిడ్డకు ఇవ్వడం ద్వారానే కలుగుతుందని విజయనగరం శాసన సభ్యులు కోలగట్ల వీబధ్రస్వామి అన్నారు. ప్రపంచ తల్లి పాల వారోత్సవంలో భాగంగా శనివారం వైద్య ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ,ఐసిడిఎస్ ఏర్పాటు చేసిన సమావేశాన్ని జ్యోతి ప్రజ్వలనంతో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తల్లి పాల ఆవశ్యకతను విస్తృతంగా ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. ఒవేరియన్, బ్రెస్ట్ కేన్సర్ నివారేంచేందుకు, తల్లి బరువు పెరగకుండా ఉండ వచ్చని, ఎముకలు గట్టిపడతాయని తెలిపారు. తల్లి పాల వలన బిడ్డ అనేక అంటువ్యాధుల నుండి కాపాడపడుతుందని అన్నారు. డబ్బాపాలు ఒదలండి...తల్లిపాలుతో మురిపాలు అందించండి అనే నినాదం ప్రాచూర్యంలోకి తేవాలన్నారు. వైయస్సార్ సిపి మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి కోలగట్ల శ్రావణి మాట్లాడుతూ తల్లి పాల ప్రాముఖ్యతను తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పార్టీ బి.సి సెల్ ప్రధాన కార్యదర్శి బొద్దాన అప్పారావు, గంధం మురళి, బొద్దశింగు ఈశ్వరరావు, పి.మురళి, బి.ఈశ్వరరావు, డి.రామస్వామి, బార సంతోష్, ఐసిడిఎస్ పిడి వి.పద్మావతి, మెప్మా ప్రతినిధి శ్రీధర్, డాక్టర్ కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## 'సహాయి' మూడవ వార్షికోత్సవం

విశాఖపట్నం : మన సహాయి మీ అందరి సహకారంతో రెండు వసంతాలు పూర్తి చేసుకుని మూడవ సంవత్సరంలోకి అడుగు పెడుతోంది. మన సహాయి ఇద్దరు టీచర్స్‌కి జీతాలు ఇచ్చి, నిరుపేద పిల్లలకు విద్యను అందిస్తుంది. పేద మహిళలకు వారి జీవనాధారం కోసం టైలరింగ్ నేర్చుకోవడానికి భవ్యత సహాయ సహకారంతో ఒక స్యూయింగ్ మిషన్, అంధుల కోసం చాప్టర్స్, స్లేట్స్, (స్టడీ మెటీరియల్) ఫోల్డింగ్ స్టిక్స్ మరియు 300, 400 కేజీల న్యూస్ పేపర్స్ (ఇది కూడా వారికి స్టడీ మెటీరియల్‌గా పని చేస్తుంది) ఇచ్చాము. గత రెండు ఏళ్లుగా కుష్టు (లెప్రసీ) రోగు లకు దుప్పట్లు, నిరుపేదలకు చలిని కాచుకోవడానికి వీలుగా రగ్గులు, మండుటెండలో దాహం తీర్చడానికి హనుమాన్ జయంతి రోజున మజ్జిగ అందిస్తున్నాము. ఒక నిరుపేద అమ్మాయికి పెళ్లి నిమిత్తం (తండ్రి లేరు, తల్లికి కీళ్లనొప్పులు) సహాయం చేయడం జరిగింది.

## పరిసరాల పరిశుభ్రత ద్వారా ఆరోగ్యానికి రక్ష

**స్వచ్ఛభారత్ కార్యక్రమంలో చోడవరం ఎస్ఐ ఎస్.ఎ.మునాఫ్**

చోడవరం : మన చుట్టూ ఉన్న పరిసరాల పరిశుభ్రత ద్వారా ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చని చోడవరం ఎస్.ఐ, ఎస్.ఎ.మునాఫ్ అన్నారు. వారం, వారం స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా పోలీస్ స్టేషన్ ఆవరణలో గల పిచ్చి తుప్పలను శనివారం తొలగిం చారు. ఈ సందర్భంగా ఎస్.ఐ మాట్లాడుతూ మన చుట్టూ ఉన్న పరిసరాలు శుభ్రంగా ఉంచడం ద్వారా ఆహ్లాదకర వాతావరణం ఏర్పడుతుంద న్నారు. వారంలో ఏదో ఒక రోజు ప్రతి ఒక్కరూ స్వచ్ఛ భారత్‌కు సమయం కేటాయించి ఆరోగ్యవంతమైన సమా జానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఐ. డి.లక్ష్మి నారాయణ, మహిళా ఎస్.ఐ టి.దివ్య, హెచ్.సిలు, కానిస్టేబుల్స్, హోంగార్డులు రాజు తదితరులు పాల్గొన్నారు.



**చోడవరం పోలీస్ స్టేషన్ ఆవరణలో స్వచ్ఛభారత్ నిర్వహిస్తున్న ఎస్.ఐలు, పోలీస్ సిబ్బంది**

## ఈ నెల 6న చోడవరంలో అవయవదానంపై అవగాహన సదస్సు

చోడవరం: ప్రపంచ అవయవదాన దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీకళాశాల లో ఈ నెల 6 మంగళవారం అవ యవదానంపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు తెలిపారు. ఎన్.ఎస్.ఎస్, వై.ఆర్.సి, ఆర్.ఆర్.సి విభాగాలతో పాటు విశ్వనాధ్ టైప్ ఇని స్టిట్యూట్, అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల సౌజన్యంతో మధ్యా హ్నం 2 గంటల నుంచి సదస్సు ప్రారంభమవుతుందన్నారు. ముఖ్య వక్తగా స్థానిక ప్రముఖ వైద్యులు బండారు సత్య నారా యణ, ఆల్ ఇండియా బాడి అండ్ ఆర్గాన్ డోనర్స్ అసోసి యేషన్ ఫౌండర్ ప్రెసిడెంట్ డాక్టర్ గూడూరు సీతామహాలక్ష్మి, ఏ.పి. స్టేట్ జీవన్ దాస్ ట్రస్ట్ ప్లాంట్ కో ఆర్డినేటర్ సి.హెచ్.ఇందిర, స్థానిక సి.హెచ్.సి, ఐసి.టి.సి, కౌన్సిలర్ ఆర్.వి.రాజు తదితరులు పాల్గొని అవయవాల మార్పిడి, బ్రెయిన్‌డెడ్ స్థితి, అవయవాల మార్పిడి పద్ధతులు, డోనర్సు కార్డు పొందడం,వాటి విధివిధానాలు, ప్రస్తుత పరిస్థితు లలో అవయవదానం ఆవశ్యకత, అవయవ దానంపై ఉన్న అపో హలు, తదితరవాటిపై కూలంకశంగా సదస్సులో చర్చించడం జరుగుతుందని, సదస్సులో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

**7న మెగా రక్తదాన శిబిరం** : చోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఈ నెల 7 బుధవారం మెగా రక్తదాన శిభిరం నిర్వహి స్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఐ.విజయబాబు తెలిపారు. ఏఎస్.రాజా వాలంటీ బ్లడ్ బ్యాంకు విశాఖపట్నం వారి నిర్వహణలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే రక్తదాన శిభిరంలో ఆశక్తిగల 18 నుంచి 60 ఏళ్ళ వయస్సు గల స్త్రీ, పురుషులు స్వచ్ఛంధ రక్తదాన శిభిరంలో పాల్గొనవచ్చని, మరిన్ని వివరాలకు ఈ నెంబర్‌ను 9014771813 సంప్రదించాలన్నారు.

## సత్వర న్యాయం అందించడమే జాతీయ లోక్ అదాలత్ లక్ష్యం



**- సీనియర్ సివిల్ జడ్జి కె.రత్నకుమార్**

పెద్దాపురం : ప్రజలకు సత్వర న్యాయం చేయడమే లోక్ అదాలత్ ముఖ్య ఉద్దేశ్యమని సీనియర్ సివిల్ జడ్జి మరియు మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ కె.రత్నకుమార్ అన్నారు. శనివారం స్థానిక కోర్టు ఆవరణలో సీనియర్ సివిల్ జడ్జి న్యాయసేవా సదన్ లో పోలీసు,ఎక్సయిజ్,రెవెన్యూ,తదితర శాఖల అధికారులు, న్యాయవాదులు, పారా లీగల్ వాలంటీర్లతో సెప్టెంబర్ 14 నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్ లో ఎక్కువ కేసులు పరిష్కారం నిమిత్తం నిర్వహించిన సమావేశంలో జడ్జి మాట్లాడుతూ గత నెల జూలై 13 న నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ లో కేసుల పరిష్కారంలో రాష్ట్రంలోను, జిల్లాలోను 2వ స్థానం సాధించామని,దీనికి కృషి చేసిన అధికారులకు,న్యాయవాదులకు జడ్జి అభినందనలు తెలియజేసారు. ఈ స్ఫూర్తితోనే సెప్టెంబర్ 14వ తేదీన నిర్వహించబో యే జాతీయ లోక్ అదాలత్ లో ఎక్కువ సంఖ్యలో కేసుల పరిష్కారానికి ఆయా పోలీసు స్టేషన్ పరిధిలో రాజీ యోగ్యమైన కేసులు గుర్తించి పరి ష్కారానికి కృషి చేయాలని అన్నారు. రెవెన్యూ పరంగా ఏలేరు రిజర్వాయర్ ప్రాజెక్టు బాధితుల నష్ట పరిహారం కేసులను కూడా రెవెన్యూ అధికారులు పరిష్కరించేలా చూడాలని అన్నారు. ఇరు వర్గాలు సంతోషంతో జీవించేలా కేసుల పరిష్కారానికి న్యాయవాదులు అధికారులు కక్షిదారులకు అవగాహన కల్పించాలని అన్నారు. ఈ సమావేశంలో జూనియర్ సివిల్ జడ్జి సి.హెచ్ సునందమ్మ, అదనపు జె.ఎఫ్.సి మేజిస్ట్రేట్ జోష్ణాదేవి, బార్ అసోసియేషన్ ప్రెసి డెంట్ వేదుల సుబ్రహ్మణ్యం,పారా లీగల్ వాలంటీర్లు బి.ఎస్.ఎన్ మూర్తి, ఎస్.అప్పలకొండ, ఏజిపి సత్యనారాయణ, ఆర్డీవో కార్యా లయం ఏవో చిన్నారావు,మండల లీగల్ సర్వీసెస్ కమిటీ సభ్యులు, ఎక్సయిజ్,పోలీసు అధికారులు, న్యాయవాదులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎరువులు అందరికీ అందాలి : సంయుక్త కలెక్టర్-2 సాల్మన్‌రాజ్



విజయనగరం : జిల్లాలో ప్రస్తుతం 25వేల 457 టన్నుల ఎరువులు ఉన్నాయని రైతులందరికి పంపిణీ చేయాలని జిల్లా సంయుక్త కలెక్టర్-2 సాల్మన్‌రాజ్ తెలిపారు. శనివారం తన చాంబర్‌లో వ్యవసాయ, మార్క్‌ఫెడ్, ఎరువుల డీలర్లతో సమా వేశమయ్యారు. ఆగస్ట్ నెలవరకు 28 టన్నులు వచ్చాయని ఎరువుల కొరత రాకూడదని అన్నారు. అలాగే కల్తీ జరగకూడదని తెలిపారు. రైతులకు నచ్చిన కంపెనీల ఎరువులే ఇవ్వాలన్నారు. బలవంతంగా డీలర్లు వారికి నచ్చని ఎరువులు ఇస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చ రించారు. ఆధార్ అను సంధానంతో ఇపోస్ ఎరువులు సరఫర చేయాలన్నారు. కొన్ని మండలాల్లో ఒక్కో వ్యక్తికి 100 బేగ్‌లెరువులు ఇచ్చామని అయితే బ్లాక్‌లో అమ్ముకుంటే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జి.ఎల్.పురం, పాచిపెంట, జి.యం.వలస తదితర ఏజన్సీ మండలాల్లో ప్రత్యేక దృష్టి పెట్టాలని నిల్వలకు సంబంధించిన నివేదిక బోర్డులో పెట్టాలని తెలిపారు. విక్రయించే దుకాణాల, గొదాముల లైసున్నులు పరిశీలించాలని తెలిపారు. ఈ సమావేశంలో వ్యవ సాయశాఖ సంయుక్త సంచా లకులు ఎం.ఆశాదేవి, ఉప సంచా లకులు కె.అప్పలస్వామి, ఆర్.శ్రీనివాసరావు, మాలకొండయ్య, మధుసూధన్ తదితర అధికారులు, డీలర్లు, ఉత్పత్తిదారులు పాల్గొన్నారు.

## మొక్కల సంరక్షణ బాధ్యత అందరిదీ

**: జిల్లా కలెక్టర్ డా.ఎం.హరిజవహర్‌లాల్**



విజయనగరం : నాటిన ప్రతీ మొక్కను సంరక్షించేలా బాధ్యత ప్రతీ ఒక్కరూ తీసుకోవా లని జిల్లా కలెక్టర్, కార్పొరేషన్ ప్రత్యేకాధికారి డా.ఎం.హరిజవహర్‌లాల్ అన్నారు. హరిత విజయనగరం కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక సెయింట్‌మేరీస్ మున్సిపల్ పార్కులో, ఎం.ఎస్.ఎన్.కాలనీలో మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సంద ర్భంగా జిల్లా కలెక్టర్ డా.ఎం.హరిజవహర్‌లాల్ మాట్లాడుతూ మొక్కలు నాటడం, సంరక్షణ ఒక సామాజిక ఉద్యమంలో చేపట్టాలన్నారు. మొక్కలు నాటడం వల్ల పర్యా వరణానికి, మాన వాళికి కలిగే ప్రయోజనాలు, వాటిని సంరక్షిం చాల్సిన ఆవశ్యకతపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించి నప్పుడే హరిత ఉద్య మం సఫలమవు తుంద న్నారు. పర్యావరణ అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పిం చేందుకు కృషి చేసినవారికి, సామాజిక బాధ్యతగా మొక్కల పెంప కాన్ని చేపట్టిన వారికి జిల్లా యంత్రాంగం తరపున అవా ర్డులు అందజేస్తామని, ప్రోత్సా హకాలు కూడా కల్పిస్తా మన్నారు. పచ్చదనం పెంపొందిం చేందుకు ప్రతీ ఒక్కరూ కంకణబద్ధులు కావాలని కోరారు. అలాగే భూగర్భ జలాలను పెంపొం దించేందుకు ప్రతీ ఇంటా ఇంకుడు గుంత తప్పనిసరిగా నిర్మించు కోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సోషల్ ఫారెస్టు అధికారి బి.జానకీ రామ్, కార్పొ రేషన్ అసిస్టెంట్ కమి షనర్ కనక మహాలక్ష్మి, ఎంహెచ్ఓ డా.ప్రణీత, పోలీసు శిక్షణ కళాశాల వైస్ ప్రిన్సిపల్ మెహర్ బాబా, అటవీ శాఖ రేంజర్ రాజశేఖర్, కాలనీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

**IN THE HON'BLE COURT OF THE XII ADDL. DISTRICT JUDGE AT : VISAKHAPATNAM**
**A.S.283/2018**

Between :
Chikkala Naidu and another ...Appellants
And
Bali Venkata Rao & 8 others ...Respondents

**Summons To Respondent No.8**
Salagamsetty Prasad,
C/o. Salagamsetty's Trust, Tharuluwada,
Resident of Tharuluwada,
Anandapuram Mandalam,
Visakhapatnam.

**APPEAL NOTICE**

Please take notice that the above named appellants filed the above appeal challenging the decree and judgement dated 03-08-2018 passed in O.S.No. 118/2009 by the Hon'ble II Addl. Junior Civil Judge, Bheemunipatnam and the matter stands posted to **21-08-2019** for your appearance either in person or through an Advocate at **10:30 A.M.** failing which the matter will be heard and decided ex-parte in your absence by the Hon'ble Court.

**(By Order of the Hon'ble Court)**
**S.ARUN DEV, Advocate**
Flat No.203, Dolphin Heights Apartments,
Siripuram,Visakhapatnam.
**Cell: 9848566903**

**IN THE HON'BLE COURT OF THE XII ADDL. DISTRICT JUDGE AT : VISAKHAPATNAM**
**I.A. 847/2018 in A.S.283/2018**

Between :
Chikkala Naidu and another ...Petitioners/Appellants
And
Bali Venkata Rao & 8 others ...Respondents
To,
**Respondent No.8**
Salagamsetty Prasad,
C/o. Salagamsetty's Trust, Tharuluwada,
Resident of Tharuluwada,
Anandapuram Mandalam,
Visakhapatnam.

**APPEAL NOTICE**

Please take notice that the above named appellants filed the I.A.No.847/2018 in A.S.283/2018 for temporary injunction from interfering in their possession and enjoyment of the schedule property against you and other respondents and the matter stands posted to **21-08-2019** for your appearance either in person or through an Advocate at **10:30 A.M.** failing which the matter will be heard and decided ex-parte in your absence by the Hon'ble Court.

**(By Order of the Hon'ble Court)**
**S.ARUN DEV, Advocate**
Flat No.203, Dolphin Heights Apartments,
Siripuram,Visakhapatnam.
**Cell: 9848566903**

**IN THE HONOURABLE COURT OF THE II ADDITIONAL SENIOR CIVIL JUDGE AT : VISAKHAPATNAM**
**I.P.5/2019**

Between :
Smt.Khairoun, W/o.Md.Rabbani ...Petitioner
And
Syed Ali & Syed Babu ...Respondent No.10

**NOTICE**

It is inform to the respondent No.10 that the petitioner has preferred the above insolvency proceedings against you & others before the Hon'ble Court of the II Addl. Senior Civil Judge, Visakhapatnam to declare petitioner as an insolvent.

Therefore it is inform to the respondent No.10 that he may submit his objections if any in the insolvency proceedings by appearing in person or through the Advocate on **22-08-2019 at 10:30 A.M.**

**(By Order of the Hon'ble II Addl. Senior Civil Judge)**

**SISTA SRINIVASA MURTY (VASU),**
**B.S. LATA & SISTA VEERA VENKAT**
**Advocates**
# 8-60-9, Vidya Nagar, Visakhapatnam-3,
**Cell: 9848191313**

## విశాఖ ఫైనాన్సియర్స్ ఫంక్షన్ హాలులో నేడు రక్తదాన శిబిరం



అనకాపల్లి : పట్టణంలో నూకాంబిక ఆలయం వద్ద ఉన్న విశాఖ ఫైనాన్సియర్స్ ఫంక్షన్ హాలులో ఆదివారం ఉదయం 9 గంటల నుండి రక్తధాన శిభిరం నిర్వహించడం జరుగుతుందని నిర్వాహకులు కోరిబిల్లి పరి ఒక ప్రకటనలో తెలిపారు. శరగడం వాసు, కొణతాల జగన్నాధరావు జ్ఞాపకార్థం 1994 - 95 లో గవరపాలెం హైస్కూలు చదువుకున్న విద్యార్థుల ఆధ్వర్యంలో ఈరక్తదాన శిభిరం జరుగుతుందని చెప్పారు. దాడి రత్నాకర్ డాక్టర్ విష్నుమూర్తి, కాంద్రేగుల దుర్గా ప్రసాద్, కాంద్రేగుల జనార్దన్ ముఖ్య అతిధులుగా పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఆసక్తి ఉన్న రక్తదాతలు విజయవంతం చేయాలని ఈసందర్భంగా కోరిబిల్లిపరి కోరారు.

# ఫిర్యాదుల స్వీకరణకు 6309898989 వాట్సాప్ నెంబరు

## -జిల్లా ఎస్పీ బి.రాజకుమారి



విజయనగరం: జిల్లాలో ఎక్కడైనా, ఏదైనా నేరం జరిగి నపుడు, పోలీసులకు వెంటనే సమాచారంను అందించేందుకు, ఏదైనా ప్రజా సమస్యలను పోలీసుల దృష్టికి తీసుకురావాలని భావించినపుడు వాట్సాప్ నంబరు 6309898989కు మెసేజ్‌ను పంపాలని జిల్లా ఎస్పీ బి.రాజకుమారి ప్రజలను కోరారు. పోలీసు సేవలను ప్రజలకు మరింత చేరువ చెయ్యాలనే సంకల్పంతోను, ప్రజల నుండి ఫిర్యాదులను పోలీసుశాఖ సులువుగా స్వీకరించేందుకు వాట్సాప్ నంబరును ప్రారంభించామన్నారు. ఈ వాట్సాప్ నంబరుకు ప్రజలు ఎవరైనా పోలీసుల దృష్టికి తీసుకురావాలి అనుకుంటున్న సమస్యలను, ట్రాఫిక్ సమస్యలు, ఈవ్ టీజింగు, మహిళా సమస్యలు, రోడ్డు ప్రమాదాలు, కోడి పందాలు, గొర్రి పందాలు, జూదాలు, బహిరంగ మద్యం, మద్యం సేవించి వాహనాలు నడిపేవారి సమాచారం, ప్రజలకు అసౌకర్యం కల్పించే న్యూసెన్సు పనులు గురించి, అనుమానితు వ్యక్తుల గురించిన సమాచారంను, శాంతి భద్రతల సమస్యలను, వ్యభిచారం, బెట్టింగులు గురించిన సమాచారం, మహిళల వేధింపులకు సంబంధించిన ఫిర్యాదులు, పోలీసులు చేసే మంచి పనులు, ర్యాగింగు సంబంధించిన ఫిర్యాదులతోపాటు, మంచి పోలీసింగుకు సలహాలను కూడా ఇవ్వవచ్చునని జిల్లా ఎస్పీ తెలిపారు. వాట్సాప్ నంబరుకు పంపే సమాచారం క్లుప్తంగా, అర్థం అయ్యే విధంగా ఉండాలని, ఫిర్యాదుకు సంబంధించిన ఫోటోలు, వీడియోలు తక్కువ నిడివితో ఏమైనా జతపర్చి పంపాలని జిల్లా ఎస్పీ ప్రజలను కోరారు. ఫ్రెండ్లీపోలీసింగులో భాగంగా జిల్లా పోలీసులను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు వాట్సాప్ నంబరును ఏర్పాటు చేసామని, సమాచారం పంపిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం, అవసరమైతే వారితో మాట్లాడి, మరిన్ని వివరాలు తెలుసుకొని, సంబంధిత పోలీసు అధికారికి చర్యలు తీసుకొనేందుకుగాను వాట్సాప్ సందేశాన్ని పంపుతామని జిల్లా ఎస్పీతెలిపారు. పోలీసులు తీసుకున్న చర్యలను ఫిర్యాదిదారునికి మళ్ళీ వాట్సాప్ సందేశం ద్వారా తెలియపరుస్తామన్నారు. పోలీసుశాఖ ఏర్పాటు చేసిన వాట్సాప్ గురించి ప్రజలకు అవగాహన కల్పించేందుకు పట్టణంలో పలు ప్రాంతాల్లో బోర్డులను ఏర్పాటు చేయనున్నట్లుగా జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ వాట్సాప్ నంబరుకు వచ్చే ఫిర్యాదులను, తీసుకున్న చర్యలను ఒక రిజిష్టరులో నమోదు చేసేందుకు ప్రత్యేకంగా నియమించబడిన పోలీసు అధికారులు, సిబ్బందికి ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామన్నారు. ఈ వాట్సాప్ నంబరు పోలీసు కంట్రోల్ రూంలో ఉంటుందని, దీనిని 24 గంIIలు పర్యవేక్షించే విధంగా డయల్ - 100 పోలీసు సిబ్బంది పని చేస్తారని తెలిపారు.

# విశాఖ అర్బన్ జిల్లా టీడీపీ ఉపాధ్యక్షురాలిగా కొత్తపల్లి ప్రభావతి



సింథియా : పారిశ్రామిక ప్రాంతం శ్రీహరిపురం కోరమండల్ లో నివాసం ఉంటున్న సీనియర్ టిడిపి మహిళా నేత, జింక్ ఆంజినేయస్వామి ఆలయ కమిటీ మాజీ చైర్మన్ కొత్తపల్లి ప్రభావతి విశాఖ జిల్లా అర్బన్ తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షురాలిగా నియమితులయ్యారు. ఈ మేరకు పశ్చిమ నియోజకవర్గం తెదేపా ఎమ్మెల్యే పి.గణబాబు శనివారం నియామక ఉత్తర్వులను ఆమెకు అందజేసారు. ఈ సంధర్భంగా ఆమె మాట్లాడుతూ ఇప్పటివరకు విశాఖ జిల్లా తెదేపా కార్యనిర్వాహక కార్యదర్శిగా పదవి చేపట్టానని తనపై అధిష్ఠానం నమ్మకంతో అర్బన్ జిల్లా తెదేపా ఉపాధ్యక్ష పదవికి ఎంపికచేయడంతో మరింత బాధ్యత పెరిగిందని అన్నారు. నాయకులును, కార్యకర్తలను కలుపుకుంటూ పార్టీ అభివృద్ధికి మరింత కృషి చేస్తానని అన్నారు. ఈ పదవికి ఎంపిక చేసినందుకు సహాయ సహకారాలందించిన నాయకులకు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. తమకు ఈ పదవి వచ్చేందుకు కృషి చేసిన స్థానిక ఎమ్మెల్యే గణబాబు, జిల్లా అధ్యక్షుడు రహమాన్‌కు కృతజ్ఞతలను తెలిపారు.

# అన్నక్యాంటిన్లు వెంటనే తెరిపించాలి



అనకాపల్లి : పేద వాడి కడుపునింపుతున్న వెంటనే తెరిపించి గతంలో మాదిరిగా యదావిదిగా కొనసాగించాలని మాజీ ఎమ్మెల్యే పీలా గోవిందసత్యనారాయణ డిమాండ్ చేశారు. తన క్యాంపు కార్యాలయంలో జరిగిన అనకాపల్లి తెలుగుదేశం పార్టీ నియోజవర్గ సమన్వయకమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పేదవాడికి మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఐదు రూపాయలకే భోజనం ఫలహారం అందించేలా అన్నా క్యాంటిన్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. దానిని ఇప్పుడు వచ్చిన ప్రభుత్వం మూసివేయడం తగదన్నారు. అలాగే ఇసుక రవాణాను పునరుద్ధరించి నిర్మాణ రంగంలో కార్మికుల కడుపు నింపాలన్నారు. అలాగే తుమ్మపాల వివిరమణ సుగర్ ఫ్యాక్టరీని పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకోవాలనిరైతుల బకాయిలు చెల్లించి కార్మికులకు ఉపాధి కల్పించాలని అన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం హాయంలో లబ్దిదారులకు మంజూరు చేసిన గృహాలకు మౌళిక వసతులు కల్పించి అందజేయాలన్నారు. గ్రామాలలో కరెంట్ కోతలు లేకుండా చూడాలని డిమాండ్ చేసారు. ఈ మేరకు సమన్వయక కమిటీ ఈ తీర్మానాలు ఆమోదించింది. పట్టణ పార్టీ అధ్యక్షులు కెకెవినారాయణరావు, కశింకోట అనకాపల్లి మండల పార్టీల అధ్యక్షులు మలసాల రమణరావు, పచ్చికూర రాము, మాజీ జెడ్పీటీసీ ధనమ్మ, పల్లెల గంగాభవానీ, మాజీ ఎంపిపీలు పెంటకోట సుబ్బలక్ష్మి, కాయల మురళీ, మళ్ల సురేంద్ర, కొణతాల వెంకటరావు, కొణతాల శ్రీనివాసరావు, పలక సత్యనారాయణ, వేగి గోపీ, శిదిరెడ్డి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో నిర్మాణ రంగానికి మంచిరోజులు

## సీఎం జగన్‌ను కలిసిన క్రెడాయ్ ఏపీ చైర్మన్ శివారెడ్డి



జెరూసెలం పర్యటనలో వున్న ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డిని కలిసిన క్రెడాయ్ ఆంధ్రప్రదేశ్ చైర్మన్ అరే శివా రెడ్డి. ఈ సందర్భంగా రాష్ట్రంలో ఇసుక లేని కారణంగా నిర్మాణ రంగం ఎదుర్కొంటున్న సమస్యల కారణంగా ఇబ్బందులను సీఎంకు వివరించారు. త్వరలోనే ప్రారంభంకానున్న నూతన ఇసుక పంపిణీ విధానం ద్వారా తగినంత లభ్యత ఉంటుందని సీఎం అభయమిచ్చారు.

# బజాజ్ ఫైనాన్స్ ఆఫర్.. డిపాజిట్లపై 8.95 వరకూ వడ్డీ రేటు

విశాఖపట్నం : బజాజ్ ఫైనాన్స్ సరికొత్త ఆఫర్ కు తెరలేపింది. డిపాజిట్లపై 8.95 శాతం వరకూ అధిక వడ్డీ రేట్లను అందించేందుకు సిద్ధమైంది. ప్రస్తుతం స్టాక్ మార్కెట్లు, మ్యూచువల్ ఫండ్స్ అస్థిరంగా ఉన్నాయి. బంగారంతో పోలిస్తే స్థిర డిపాజిట్లు సురక్షితమైన పెట్టుబడి గా అందరూ భావిస్తున్నారు. పెట్టుబడికి భరోసా ఇస్తూ.. నిధులను పెంచుకోవడానికి ఇది సరైన మార్గంగా భావిస్తున్నారు. అత్యంత ప్రాచుర్యం పొందిన పెట్టుబడి ఎంపికల లో ఇది ఒకటి. బజాజ్ ఫైనాన్స్ ఫిక్స్ డిపాజిట్ కొత్త కస్టమర్లకు అత్యధిక వడ్డీ రేట్లను అనగా.. 8. 60 శాతం వరకు, ప్రస్తుత కస్టమర్లకు 8,85 శాతం వరకు, సీనియర్ సిటిజన్లకు 8.95 వరకు వడ్డీ రేట్లను అందిస్తోంది. బజాజ్ ఫైనాన్స్ ఫిక్స్‌డ్ డిపాజిట్ అంది ంచే వడ్డీ రేట్లు అత్యంత సురక్షితమైనవిగా క్రిసిల్, ఎఫ్ఏఏఏ, ఐసిఆర్ఏ, ఎంఏఏఏ చేత రేటింగ్ పొందింది.

# ఘనంగా సత్తెమ్మతల్లి వార్షికోత్సవం





అనకాపల్లి : పట్టణంలోని గవరపాలెం దాసరిగెడ్డ రోడ్‌లో ఉన్న సత్తెమ్మతల్లి ఆలయ 28 వ వార్షికోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ఉదయం నుండి ప్రత్యేక పూజలు జరిగాయి. పలువురు ప్రముఖులు అమ్మవారిని దర్శించుకుని తరించారు. భక్తుల రాకతో ఆ ప్రాంతమంతా సందడిగా మారింది. అనకాపల్లి శాసన సభ్యులు గుడివాడ అమర్‌నాధ్, మాజీ శాసన సభ్యులు పీలా గోవింద సత్యనారాయణ, వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ నాయకులు దంతులూరి దిలీప్ కుమార్, ఆళ్ల నాగేశ్వరరావు, ఆ పార్టీ పట్టణ అధ్యక్షులు మందపాటి జానకిరామరాజు, పాలమరశెట్టి మురళీ, మళ్ల సురేంద్ర, బుద్ద రమణాజీ, జాజుల రమేష్, పెతకం శెట్టి జగన్మోహన్ తదితరులు అమ్మవారిని దర్శించు కున్నారు. ఈసందర్భంగా వారికి ఆలయ మర్యాదలతో నిర్వాహకులు స్వాగతం పలికారు. తీర్థ ప్రసాదాలు అందజేశారు.

# కాలుష్య నియంత్రణ అందరి తక్షణ కర్తవ్యం

విశాఖపట్నం : భూమి, గాలి, నీరు, వాసనకు సంబం ధించిన కాలుష్య నియంత్రణ అందరి తక్షణ కర్తవ్యమని పర్యావరణవేత్త బొలిశెట్టి సత్యనారాయణ, శనివారం ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో అతను మాట్లాడుతూ సమాజంలో అన్ని వర్గాలు చిత్తశుద్ధితో కాలుష్య నియంత్రణపై ముందడుగు వేయాల్సిన అవసరం ఉందన్నారు. కాలుష్య నియంత్రణకు కొరియా దేశంలో ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారో పరిశీలించేందుకు తాను ఆ దేశాన్ని సందర్శించానన్నారు. ఆ దేశంలో రసాయన పరిశ్రమలు, వ్యర్థాల నిర్వహణ ప్లాంట్లు, జీరో శాతం కాలుష్యాన్ని సాధించి చక్కటి వాతావరణాన్ని సొంతం చేసుకుందని పేర్కొన్నారు. మహా విశాఖ నగరపాలక సంస్థ నిర్వహిస్తున్న ముడసర్లోవలోని (రోజుకి 13 మిలియన్ లీటర్ల వ్యర్థాలు), అప్పుఘర్లో (25 మిలియన్ లీటర్ల వ్యర్థాలు), లక్ష్మీటాకీస్ వద్ద (38 మిలియన్ లీటర్ల వ్యర్థాలు) శుద్ధి చేస్తున్న 'సీవేజ్ ట్రీటిమెంట్ ప్లాంట్లను (ఎస్.టి.పి.) మేం సందర్శించామని చెప్పారు. కాలుష్య నియంత్రణకు సాధ్యమయ్యే అన్ని చర్యలు తీసుకునేందుకు సుముఖంగా స్పందించారు. అయితే పారిశ్రామిక వ్యర్థాలను శుద్ధిచేసే ప్లాంట్లు (ఇటి.పి.) వ్యర్థాలను శుద్ధిచేయకుండానే సముద్రంలో కలిసిపోయి, సుందరమైన సాగరతీరాలకు చేటు చేకూరుస్తున్నట్లు గుర్తించామన్నారు. జి.వి.ఎం.సి., కాలుష్య నియంత్రణ మండలి తప్పిదాలతోపాటు, నగర ప్రకృతి సౌకర్యాలను పరిరక్షించుకునే ధ్యాసే విశాఖ పౌరులకు లేకపోవడంవల్లే ఈ రకమైన పరిస్థితులు నెలకొన్నాయని అభిప్రాయపడ్డారు. మన దేశంలో ప్రముఖ నగరాలను కాలుష్యం నుంచి పరిరక్షించేందుకు అదనంగా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. మనదేశంలో ఉపరితల భూగర్భ జల వనరుల పరిరక్షణ లో నిర్లక్ష్యాన్ని తాము గుర్తించామన్నారు. విశాఖలోని నదులు, నీటి వనరులు, చెరువుల పునరుద్దరణ, పరిరక్షణ కోసం సామూహిక ఉద్యమం నిర్వహించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రజలందరూ స్వచ్ఛందంగా ఈ ఉద్యమంలో పాల్గొనాలని ఆయన కోరారు.

# భూదందా సాగనివ్వం

మొదటి పేజీ తరువాయి

వాల్తేరు డివిజన్ యధావిధిగా కొనసాగించాలంటూ రైల్వే మంత్రిని ఈ నెల 5న ఢిల్లీలో ఎంపీలు అందరమూ కలుస్తామని విజయసాయిరెడ్డి చెప్పారు. సీఆర్జెడ్ నిబంధనల ఉల్లం గించి, తీరం వెంబడి నిర్మాణాలు చేపట్టారు. అక్రమ నిర్మాణాలు కూల్చి వేయాలని ఆయన కోరారు. వారసత్వ సంపదగా వచ్చిన బౌద్ధ స్థలాలను కాపాడాల్సిన అవసరం ఉంది. వాటి పరిరక్షణ కోసం తమ ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు.

### రైతులను ఆదుకోవాలి

**ఈ సమావేశంలో మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ** తన నియోజకవర్గంలో మజ్జివలస సహా పలు ప్రాంతాల్లో కౌలు రైతులు ఇబ్బంది పడుతున్నారని సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. ప్రభుత్వ సూచనలు రైతులతో వివరించడంలో అధికారులు విఫలమయ్యారన్నారు. ఆన్ లైన్ లో వివరాలు నమోదు చేస్తేనే కౌలు రైతులకు అందాల్సిన లబ్ది అందుతుందన్నది ప్రభుత్వ నిబంధన అయినప్పటికీ చాలా గ్రామాల్లో వెబ్ లాండ్ ప్రక్రియ పూర్తి కాలేదన్నారు. ఆర్డీవో సహా అధికారులు ఈ విషమై పూర్తి వివరాలు అందజేయాలని కోరారు. దీనికి ఆర్డీవో తేజ్ భరత్ స్పందిస్తూ సమస్యలున్నమాట వాస్తవమేనని ఈ సమస్య పరిష్కారానికి ఒక కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. గత ప్రభుత్వంలో చాలా మంది నేతలు రైతులను బెదిరించి, భయపెట్టి భూ కబ్జాకు ప్రయత్నించారని పరోక్షంగా అప్పటి మంత్రి గంటా పేరును ప్రస్తావించారు. ఇప్పటికీ



రైతులు చాలా ఆందోళనగా ఉన్నారన్నారు.

**ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ..** ఈ సమస్య ఒక్క భీమిలి పరిధిలోనే కాదని తన నియోజకవర్గ పరిధిలో పంచగ్రామాలతో సహా అనేక చోట్ల కౌలు రైతులు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఇప్పటికి రైతులు పెట్టుకున్న దరఖాస్తులు వేలాదిగా పెండింగ్‌లో ఉన్న విషయాన్ని గుర్తు చేశారు. ఇదే విషయమై ఆర్డీవో మాట్లాడుతూ కొన్ని సమస్యలు కోర్టు పరిధిలో ఉన్నందున తాము తలదూర్చుకోలేకపో యామని ఇకపై సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

**ఎంపీ డాక్టర్ సత్యవతి మాట్లాడుతూ...** ఎరువుల భారం మోయలేని రైతులకు ఖర్చులేని సేంద్రీయ వ్యవసాయంపై అవగాహన కల్పించాలని ప్రభుత్వం చిత్తశుద్ధితో చేస్తున్న వివరాలను అధికారులు ప్రభుత్వం తరపున రైతులకు వివరించాలని కోరారు. కొన్ని రకాల ఎరువులు వాడడం వల్ల రైతులు నష్టపోతున్నారని భయంకరమైన వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని దీనిపై అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. ఎమ్మెల్యే గొల్ల బాబూరావు మాట్లాడుతూ.. తన నియోజకవర్గ పరిధిలోని బంగారుపాలెం ప్రాంతంలో నేవల్ బేస్ ఏర్పాటు చేస్తూ కేంద్రం నిర్ణయించిన నేపథ్యంలో రైతులు ఆందోళన చెందుతున్నారని చెప్పారు. పదేళ్లగా తమకు నష్టపరిహారం కూడా సమగ్రంగా అందజేయలేదని రైతులు వాపోతున్నారని సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. రైతుల పొలాలకు నీళ్లు వెళ్లకుండా నేవల్ విభాగం గోడ కట్టేస్తుందని ఆయా పరిధిలోని మత్యకారులు వేటకు వెళ్లలేని పరిస్థితిలో ఉన్నారని అధికారులు ఈ సమస్యపై దృష్టి సారించాలన్నారు.

**ఎమ్మెల్సీ మాధవ్ మాట్లాడుతూ..** రైతులకు చాలా చోట్ల పూర్తిస్థాయిలో విత్తనాలు అందలేదని సోనా మసూరి, విత్తనాల కొరత చాలా ఎక్కువగా ఉందని అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. వ్యాపారులు ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారని చట్ట ప్రకారం వ్యవహరించాలని కోరారు. దీనిపై వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ మాట్లాడుతూ రైతులకు అవసరమైనంత కంటే ఎక్కువగానే ఆర్జిఎల్ విత్తనాలను సిద్ధం చేశామని జిల్లాలో ఎక్కడా సమస్యలు లేవని స్పష్టం చేశారు. వ్యవసాయ అనుబంధ సమస్యలపైన దృష్టి సారించామన్నారు.



### తెలుగుకు ప్రాముఖ్యత కల్పించాలి

ఎమ్మెల్సీ బుద్ద జీవో 420 ప్రకారం ప్రభుత్వకార్యక్రమాల్లో, బోర్డులు తెలుగులోని వుండాలని శాసనమండలి సభ్యుడు బుద్దా నాగజగదీశ్వరరావు కోరారు. శాసనమండలిలో ఈ సమస్యను లేవనెత్తినప్పుడు పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు బదులిస్తూ తెలుగులో అన్ని కార్యక్రమాలు చేపడతామని, తెలుగు అకాడమీ చైర్మన్ ను నియమించి తెలుగుకు ప్రాముఖ్యత కల్పిస్తామన్నారు. కాగా జిల్లా సమీక్షా సమావేశంలో ఇచ్చిన పుస్తకాలు ఇంగ్లీష్లో ఇవ్వడం సరికాదని వెల్లడించారు. దీనికి మంత్రులు ముత్తంశెట్టి, మోపిదేవి సమాధానం ఇస్తూ తప్పకుండా అమలు చేస్తామని తెలియజేశారు.

## జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో న్యాయ విజ్ఞాన్ సదస్సు

భీమునిపట్నం: తగరపువలస జిల్లా పరిషత్ బాలికల పాటసాలలో న్యాయ విజ్ఞాన్ సదస్సు జరిగింది.ఈ కార్యక్రమం లో ఆడపిల్లల పై ఉన్న చట్టాలను వాటి యొక్క బాధ్యతలను తెలియజేసారు. దీనిలో భీమిలి జూనియర్ సివిల్ జడ్జ్ ప్రమీలా రాణి,బార్ అసోసియేషన్ కార్యదర్శి ఎం.వెంకటేశ్వరరావు, ట్రెజరర్ ఎం. సునీల్, లోక్ ఆదాలత్ మెంబర్ పి.చందు,ఎ జి పి శివ, న్యాయవాదులు పార్వతీశం, సుదాకర్, ఎన్ సూరిబాబు, వుయ్ కేర్ యు ఇన్ ఛార్జ్ వెంపాడ శ్రీనివాసరెడ్డి తధితరులు పాల్గొన్నారు.

## సోషల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ భవనంలో ఉన్న 20 సెంట్ల స్థలం కేటాయించాలని వినతి

అన్నవరం: తూ.గో.జిల్లా ప్రత్తిపాడులో నూతనంగా నిర్మిస్తున్న ప్రతిపాడు కోర్టు భవనం పక్కనే నిరుపయోగంగా ఉన్న 20 సెంట్ల ఉన్న సోషల్ వెల్ఫేర్ డిపార్ట్ మెంట్ కి చెందిన బాయ్స్ హాస్టల్ భవనంను కోర్టు కి కేటాయించలని మరియు ఎన్నో సంవత్సరాలుగా ప్రతిపాడు కోర్టులో ప్రాక్టీసు చేస్తున్న న్యాయవాదులకు హౌస్ సైట్స్ మంజూరు చెయ్యాలని కోరుతూ శనివారము ఉదయం 10 గంటలకి ప్రతిపాడు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పెద్దాపురం ఆర్డివో శ్రీ మల్లిబాబు గారిని కలిసి వినతి పత్రం ఇవ్వడం జరిగింది.ఈ విషయమై ఆర్డివో గారు సదరు న్యాయవాద ప్రతినిధి బృందం తో మాట్లాడుతూ ఖాలీ స్తలాన్ని సందర్శించి,కోర్టు కు కేటాయించదానికి కృషి చేస్తానని,న్యాయవాదులకు హౌస్ సైట్స్ కోసం ప్రభుత్వానికి నివేదిస్తానని సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమం లో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ శివ, వైస్ ప్రెసిడెంట్ సుగుణ, వెంకటరావు, ఆకాశపు. మల్లేశ్వరరావు, దేవి, మధు, చిట్టిబాబు, నరసిహారావు, రాజేష్ లు పాల్గొన్నారు.

## స్వామివారి ప్రసాదం 500 కేజీల లడ్డూ వితరణ చేసిన దేవస్థానం ఈవో చైర్మెన్



అన్నవరం: తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో స్వామివారి జన్మదినం ను పురష్కరించుకొని శుక్రవారం రోజున శ్రీ స్వామివారికి నివేదన చేసిన లడ్డూ ప్రసాదంను శనివారం ఉదయం 9 గంటలకు దేవస్థానం ఈవో ఎం.వి.సురేష్ బాబు,చైర్మన్ ఐ.వి.రోహిత్,పి.ఆర్వో తులా. రాముడు భక్తులకు,గ్రామస్థులు 500కేజీల ప్రసాదం లడ్డూను వితరణ చేసారు.

# వినతి పత్రం



భీమునిపట్నం: రాజ్యసభ సభ్యులు విజయసాయి రెడ్డి కి స్థానిక సమస్యలపై భీమిలి విద్యార్థి విభాగం నాయకులు రాష్ట్ర కార్యదర్శి ఆర్ ప్రభాకర్ నాయుడు, భీమిలి ఇంచార్జ్ కొయ్య రామకృష్ణ లు కలిసి శనివారం వినతి పత్రం అందజేసారు.

స్థానిక జూనియర్ కళాశాల లో పర్మినెంట్ లెక్చరేర్ల బదులు కాంట్రాక్ట్ లెక్చరేర్ల కొనసాగిస్తున్నారు, అలాగే విద్యాసంస్థలలో మరుగు దొడ్లు, అలాగే బి.సి, ఎస్.సి, ఎస్.టి. హాస్టల్లో కనీస వసతలు లేవని దీనిపై అధికారుల దృష్టికి ఎన్నిసారులు చెప్పినా పట్టించు కోలేదని, అలాగే చిప్పాడ దీవిస్ కంపినీ లో స్థానిక నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, నిరుద్యోగ యువతకు వృత్తి విద్యా శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేయలని వారు వినతి పత్రం తెలియజేసారు.

## అపోహాలు వద్దు..తల్లిపాలు ముద్దు

### నర్సీపట్నం సిడిపిఒ జివి.రమణి





నర్సీపట్నం/రోలుగుంట, గొలుగొండ: అపోహాలు వద్దు తల్లి పాలే ముద్దు అని నర్సీపట్నం సిడిపిఒ జివి.రమణి అన్నారు. శనివారం నర్సీపట్నం మండలంలోని గబ్బాడ సెక్టార్ సూపర్‌వైజర్ చంద్రమ్మ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అదే విధంగా రోలుగుంట మండలం శరభవరంలో అంగన్వాడీ కార్యకర్త మణి, వరలక్ష్మి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. గొలుగొండ మండలం జోగుంపేటలో భవానీ, నాగలక్ష్మిలు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ విజయలక్ష్మి, భాస్కరకుమారి, సత్యవతి, ప్రసాద్, తల్లులు పాల్గొన్నారు. అదే విధంగా నర్సీపట్నం మండలం పెదబొడ్డేపల్లి, వీర్రాజు టాకీసు, ఎస్సీ కాలనీ, మెట్టపాలెం గ్రామాల్లో సిడిపిఒ ఆధ్వర్యంలో వారోత్సవాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో హెచ్ఎస్ రమణ, ఎఎన్ఎం కృష్ణవేణి, సూపర్‌వైజర్లు, పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో తల్లిపాలు వారోత్సవాలు



భీమునిపట్నం; తల్లిపాలు వారోత్సవాలు బాగంగా శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి లో గర్భినీలకు బాలింతలకు తల్లిపాలు యొక్క ప్రాదాన్యత ను అవగాహన కలిప్పించారు . ఈ కార్యక్రమం లో సి.డి.పి.ఓ. డి.వెంకటేశ్వరి, సూపర్ వైజర్ ఆర్.నాగేశ్వరి, ప్రభుత్వ ఆసుపత్రి సూపరరిండెంట్ దిద్దే సిద్ధార్థ కుమార్, అంగన్వాడి సిబ్బంది పాల్గొన్నారు.

## 5 నుంచి గ్రామ వాలంటీర్లకు శిక్షణా తరగతులు

నాతవరం: ఈ నెల 5 నుంచి ఎంపికైన గ్రామ వాలంటీర్లకు శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నా మని నాతవరం ఎంపిడిఒ ఎల్.యాదగిరీశ్వర రావు తెలిపారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ నాతవరం 38, చెర్లోపాలెం 17, ఎంబి.పట్నం 31, మాధవనగరం 6, సరుగుడు 18, ఏపిపురం 8, చమ్మచింత 12, డి.యర్రవరం 13, గన్నవరం 22, గాంధీనగరం 4, గొలుగొండపేట 8, గుమ్మడుగొండ 9, గునుపూడి 16, కెవి.శరభవరం 3, జిల్లేడుపూడి 21, ఎస్‌బి.పట్నం 4, మన్యపురట్ల 22, పి.జగ్గం పేట 10, విబి.అగ్రహారం 4, ఆర్‌పి.అగ్రహారం 9, పికె.గూడెం 12, వల్సంపేట 10, వేములపూడి 6, వైబి.అగ్రహారం 4, వైడిపేట 16 మొత్తం 332 మందికి నిర్దేశించిన కేంద్రాల్లో శిక్షణా తరగతులు ఉంటాయన్నారు. ఈ శిక్షణా తరగతులు ఈ నెల 5 నుంచి 8వ తేదీ వరకు ఉంటాయన్నారు. కావున ఎంపికైన అభ్యర్థులు తప్పనిసరిగా శిక్షణా తరగతులకు హాజరు కావాలని, లేకుంటే అనర్హులుగా గుర్తిస్తామని తెలిపారు.

## ఘనంగా సియోను ప్రార్థనా మందిరం వార్షికోత్సవ వేడుకలు

దేవరాపల్లి, : మండలంలోని కాశీపురం సీయోను ప్రార్థనామందిరం 40వార్షికోత్సవ వేడుకలు శనివారం దైవజనులు మత పెద్దల సమక్షంలో అత్యంత భక్తి శ్రద్దలతో ఈ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ వార్షికోత్సవ వేడుకలు బిషప్ జి . టైటస్ అధ్యక్షతన ఈ వేడుకలు వాతావరణంలో సంభవించే మార్పులు చిరుజల్లులతో కూడిన వర్షాన్ని సైతం లెక్క చేయకుండా మత పెద్దలు దైవజనులు భక్తి శ్రద్ధలతో పాటలతో, భజనలతో ప్రార్థనలు నిర్వహించిన భారతదేశంలో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని అలాగే వర్షాలు సకాలంలో పడి రైతుకు పంటలు బాగా పండాలని వారు ప్రార్థనలు చేసినారు.అనంతరం మధు ప్రకాష్ చేతుల మీదుగా నలభై మంది పాస్టర్లకు మెగాఫోన్ పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో సుప్రీం కోర్టు అడ్వకేట్ డాక్టర్ జిఎస్ వర్రపసాద్ ,ఎస్ కె సలీమ్ ,వెదురుపర్తి తిరుమలరావు ,జయరాజ్, విజయరాజ్, రామారావు, నారాయణ, బొడ్డు పేరినాయుడు, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## రేపటి నుంచి వాలంటీర్లకు శిక్షణా తరగతులు



గొలుగొండ: మండలంలో ఎంపికైన గ్రామ వాలంటీర్లకు సోమవారం నుంచి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని గొలుగొండ ఎంపిడిఒ డేవిడ్‌రాజు తెలిపారు. శనివారం ఆయన స్థానిక విలేఖర్లతో మాట్లాడుతూ మండలంలో 15909 కుటుంబాలుకు 317 మంది గ్రామ వాలంటీర్లను ఎంపిక చేశామన్నారు. ఎంపిక చేసిన వాలంటీర్లులో ఎస్సీ 55, ఎస్టి 37, బిసి 184, ఒసి 41మంది ఉన్నారన్నారు. ఎంపికైన వారందరికీ రెండు విడతలుగా ఈ నెల 5 , 6 తేదీలలో 13 పంచాయతీలకు, 7, 8 తేదీల్లో 11 పంచాయతీకి చెందిన వాలంటీర్లకు శిక్షణ అందజేస్తామని తెలిపారు. ఎంపికైన వారందరికీ ఆయా పంచాయతీ కార్యదర్శులు సమాచారం అందిస్తారని, వారికి కేటాయించిన తేదీల్లో శిక్షణా తరగతులకు తప్పకుండా హాజరు కావాలని ఆయన తెలిపారు.

## సర్టిఫికేట్ ఆఫ్ ఎక్సలెన్స్ అవార్డుకు నర్సీపట్నం ఏరియా ఆసుపత్రి




నర్సీపట్నం: నర్సీపట్నం ఏరియా ఆసుపత్రిలో ఐసిటిసి(హెచ్ఐవి పరీక్షల విభాగం)లో నాణ్యత ప్రమాదాలను పాటిస్తునందుకు గాను సర్టిఫికేట్ ఆఫ్ ఎక్సలెన్స్(జిఎంఎస్)కు ఎంపిక చేశారు. విజయవాడలోని హోటల్ అజంతాలో నిర్వహించిన అవార్డు ఫంక్షన్‌లో (ఎన్ఎసిఒ) కంన్సల్‌టెంట్ చేతుల మీదుగా ఆసుపత్రి ఐసిటిసి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కనకదుర్గ, కౌన్సిలర్స్ పద్మజ, డిపి చంద్రశేఖర్, ల్యాబ్ టెక్నిషియన్ ఆర్.కృష్ణశాస్త్రిలకు అందజేశారు.

హెచ్ఐవి వ్యాధి నిర్ధారణ పరీక్షల నిర్వహణ, రోగికి నివేదికలు అందజేయడం, వివరాలు నమోదు తదితర అంశ్యాలను ప్రామాణికంగా తీసుకొని ఈ సర్టిఫికేట్స్‌ను అందజేశారు.

ఈ కార్యక్రమంలో విశాఖ జిల్లా ఎయిడ్స్ అధికారులైన శైలజ, డిస్ట్రిక్ట్ ఐసిటిసి సూపర్‌వైజర్ బద్రి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల సౌకర్యాలపై రాష్ట్ర మానవ హక్కుల మిషన్ ఆరా

అన్నవరం: తూర్పుగోదావరి జిల్లాలోని ప్రత్తిపాడు లో ఉన్న ప్రగతి విద్యా సంస్థలను రాష్ట్ర మానవ హక్కుల మిషన్ ప్రతినిధులు శనివారం సందర్శించారు.ఇక్కడ విద్యార్థుల సంక్షేమం, యాజమాన్యం పనితీరు, ప్రజాప్రనిధులు నిర్లక్ష్యం,ప్రభుత్వ నిబంధనల అమలు,పాలనాపరమైన సమస్యల గురించి ఆరా తీసి,ఇక్కడ మానవ హక్కుల పరిరక్షణ తీరు వంటి అంశాలపై క్షుణ్ణంగా మానవ హక్కుల మిషన్ ప్రతినిధులు అధ్యయనం చేశారు.స్కూలు, జూనియర్ కాలేజ్ నిర్వహణలో పాలనా పరమైన ప్రభుత్వ నిబంధనల అమలు గురించి నేరుగా యాజమాన్యాన్ని అడిగి తెలుసుకున్నారు. స్వీయ విచారణలో నిర్లక్ష్యపూరితమైన సమస్య లను గుర్తించారు.అలాగే స్కూలు నందు 25 శాతం ఉచిత విద్య ప్రవేశాల అమలు,పీజులు నియంత్రణ, జూనియర్ కాలేజి విద్యార్థులు కొరకు మౌలిక వసతులు కల్పన,పీజులు,పుస్తకాలు,ఏక రూపతా దుస్తులు రుసుములు తదితరు విద్యా సంబంధిత వివరాలు గోప్యంగా ఉంచినా,అమలు నిరాకరించినా మానవ హక్కుల మిషన్ విద్యార్థుల తరపున న్యాయపరమైన చర్యలకు మానవ హక్కుల మిషన్ బాధ్యత తీసుకుని ప్రభుత్వాలపైన,విద్యా సంస్థల యజమానుల పైన చట్టబద్ధమైన ఒత్తిడి తీసుకు వస్తామని మిషన్ సభ్యులు విద్యార్థులకు భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో తూర్పు గోదావరి జిల్లా లీగల్ సెల్ సెక్రటరీ,న్యాయవాది, పెద్దాపురం డివిజన్ ఎస్సీ,ఎస్టీ సెల్ మానిటరింగ్ కమిటీ సభ్యులు పిల్లి.బలరాముడు, రాష్ట్ర మానవ హక్కుల మిషన్ సభ్యులు ఇండుగపల్లి.నూకరాజు, పలివెల.నాగేంద్ర రాజు (న్యాయవాది), అబ్బిరెడ్డి. నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

రోలుగుంట: రోలుగుంట మండలం అడ్డసరం పంచాయతీలో శనివారం దిబ్బలపాలెం గ్రామ రామమందిరం వద్ద దిబ్బలపాలెం యూత్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా చెట్లను పెంచి పర్యావరణాన్ని కాపాడాలని, ప్రతీ ఒక్కరూ మొక్కలను పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూత్ సభ్యులు విసారపు కృష్ణ పాల్గొన్నారు.

## తల్లిపాలు బిడ్డకు తప్పనిసరి

### -ఐసీడీఎస్ సూపర్వైజర్ హైమావతి

దేవరాపల్లి : రెండేళ్ల పాటు తల్లిపాలు బిడ్డకు అందించడం వలన శిశువుకు వ్యాధి నిరోధక శక్తి పెరిగి శిశువు ఆరోగ్యవంతంగా ఉంటాడని ఐసిడిఎస్ సూపర్వైజర్ కె. హైమావతి అన్నారు. తల్లిపాలు వారోత్సవాల్లో భాగంగా శనివారం మండలంలోని చిననందిపల్లి అంగన్వాడీ సెంటర్లలలో తల్లిపాలు వారోత్సవాలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ,బాలింతలు, కిషోర్ బాలికలకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కలుగు చేశారు. అలాగే శిశువుకు టీకాలు వైద్యులు తెలిపిన టైమ్లో వేయించుకోవటం ,అలాగే బాలామృతం అందించడం వలన పిల్లలు బలంగా దృఢంగా ఎదుగుతారని అలాగే మంచి పోషక విలువలు కూడా వారికి అందుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ డి. అరుణ శ్రీ ,వేచలం పిహెచ్సి ఎఎన్ఎం ఎం. జె .లక్ష్మి ,అంగన్వాడి బోధకురాలు కె. ఎర్రమ్మ , ఆర్. హైమా తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## శిథిలావస్థలో ఉన్న కల్వర్టులను ఆధునీకరించండి



గాజువాక: నియోజకవర్గం లోని జీవీయంసీ 61వ వార్డు పరిధి సనత్‌నగర్, హరిణి ఆసుపత్రిలో గల రహదారి లో కల్వర్టులు శిథిలావస్థకు చేరుకున్నాయని, తక్షణమే వాటిని ఆధునీకరించాలని ఆంధ్రప్రదేశ్ బిసి సంక్షేమ సంఘం గాజువాక అధ్యక్షులు జగారపు శ్రీనివాసరావు శనివారం డిమాండ్ చేసారు. ఈసంధర్బంగా ఆయన మాట్లాడుతూ గతప్రభుత్వ హాయంలో కల్వర్టుల ఆధునీకరణకు సుమారు రూ. 9లక్షల 86వేలు జీవీయంసీ మంజూరు చేయడం జరిగిందని, అయితే పనులు మాత్రం చేపట్టలేదని, దీనిపై అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసిన పట్టించుకోవడంలేదని ఆందోళన వ్యక్తం చేసారు. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేయగా నూతన ప్రభుత్వం ఏర్పాటు తర్వాత ప్రారంభించలేని పనులన్నీ రిజెక్ట్ చేసారని అధికారులు బదులు ఇచ్చినట్లు తెలిపారు. దీనిపై పలుమార్లు పత్రికలలో వార్తలు వచ్చిన అధికారులు తీరు మారలేదని ఇప్పటికైన జీవీయంసీ ఇంజినీరింగ్ విభాగం ప్రజాసమస్యలను పట్టించుకోవాలని తక్షణమే సమస్యలను పరిష్కరించాలని కోరారు.

## ర్యాగింగ్‌కు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవు



సింథియా: విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని మల్కాపురం పోలీస్‌స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఎల్.బాస్కరరావు హెచ్చరించారు. హిందుస్థాన్ షిఫ్‌యార్డు డిగ్రీ కళాశాలలో శనివారం ర్యాగింగ్ పై విద్యార్థులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మల్కాపురం సి.ఐ. ఎల్.బాస్కరరావు పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులు తోటి విద్యార్థులవద్ద అమర్యాదగా ప్రవర్తించరాదని తెలిపారు. ర్యాగింగ్ రహిత కళాశాలగా విద్యార్థులు తీర్చిదిద్దాలని అన్నారు. ర్యాగింగ్ బారిన పడి బంగారు భవిష్యత్‌ను పాడు చేసుకోవద్దని అన్నారు. ర్యాగింగ్ వలన అనేక అనర్థాలు జరుగుతాయని, ఇటువంటి చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలకు బాధ్యులవుతారని, దీనివలన భవిష్యత్‌లో చదువుకోవడానికి వీలు కలగదని హెచ్చరించారు. ర్యాగింగ్ వలన బంగారు భవిష్యత్ నాశినమవుతుందని దీనిని విద్యార్థులందరూ గుర్తించుకోవాలని అన్నారు. మత్తు పదార్థలకు దూరంగాఉండాలని అన్నారు. ఉన్నత భావాలతో మెలిగి,విద్యపై మనస్సుపెట్టి, ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని తద్వారా తల్లిదండ్రులకు, కళాశాలకు, దేశానికి పేరుతేవాలని సూచించారు. ఎవరైన ర్యాగింగ్‌కు పాల్పడినట్లు అనిపిస్తే తమకు ఫిర్యాదు చేయాలని కోరారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ బి.శర్వేశ్వరావు సభా అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో యం.డి. ఇబ్రహిం, కళాశాల ఎన్‌సిసి ప్రోగ్రాం అధికారి కె.గోపినాథ్, ఎన్ఎస్ఎస్ అధికారి జె.సోభన్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## టీటీడీలో మెరుగైన సేవలకోసం
# శారదాపీఠాధిపతి సలహాలు, సూచనలు

- మహా స్వామి వారితో కలిసి గంగా స్నానం ఆనందదాయకం
- వేద పఠనం విని తరించాం • స్వామీజీ ఆశీస్సులు గైకొన్నాం
- టీటీడీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి దంపతులు



రుషీకేశ్ : టీటీడీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి దంపతులు రిషికేశ్ పర్యటనలో భాగంగా అక్కడ చాతుర్మాస దీక్షలో ఉన్న విశాఖ శారదా పీఠాధిపతులు శ్రీ స్వరూపానందేంద్ర సరస్వతీ మహాస్వామి, స్వాత్మానందేంద్ర స్వామిలను ఆయన దర్శించుకున్నారు. కేవలం ఆయన ఆశీస్సుల కోసమే వైవీ సుబ్బారెడ్డి రిషికేశ్ వెళ్లారు. స్వామీజీతో కలిసి సుబ్బారెడ్డి దంపతులు గంగాస్నానమాచరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా టీటీడీలో మెరుగైన సేవల కోసం సూచనలు, సలహాలు అందించాలని శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతీ మహాస్వామి వారిని వైవీ సుబ్బారెడ్డి కోరారు. ఈ సందర్భంగా వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ.. హిందూ ధర్మ పరిరక్షణ కోసం విశాఖ శ్రీ శారదాపీఠాధిపతులు శ్రీ శ్రీ శ్రీ స్వరూపానందేంద్ర సరస్వతీ మహాస్వామివారు ప్రతీ ఏటా చాతుర్మాస్య దీక్ష చేపట్టడం సంతోషకరమన్నారు. రాత్రి ఆశ్రమంలోనే బస చేసారు. శనివారం ఉదయం పూజ్యస్వామిజీతో కలిసి గంగానదిలో పుణ్యస్నానమాచరించారు శ్రీ వై.వి. సుబ్బారెడ్డి దంపతులు. స్వామీజీ నిర్వహించే పీఠార్చనలో శనివారం పాల్గొన్నారు. చాతుర్మాసదీక్ష సందర్భముగా ఆశ్రమంలో సాగే వేదపఠానాన్ని విని తరించారు. అనంతరం శ్రీ శ్రీ శ్రీ స్వరూపానందేంద్ర సరస్వతీ మహాస్వామివారితో మరియు శ్రీ శ్రీ శ్రీ స్వాత్మానందేంద్ర సరస్వతీ స్వామివారితో ఏకాంతంగా రెండు గంటలపాటు చర్చించారు. ఈ సంవత్సరం చాతుర్మాస్య దీక్షలో పాల్గొనడం చాలా ఆనందంగా ఉన్నదని ఛైర్మన్ తెలియజేసారు. హిందూ ధర్మ పరిరక్షణకు శారదాపీఠం చేపట్టిన సేవలు అభినందనీయమని ఆయన కొనియాడారు. అనంతరం రిషికేశ్‌లోని టీటీడీ సమాచార కేంద్రం, ఆంధ్ర ఆశ్రమంలోని శ్రీ వేంకటేశ్వరస్వామివారి ఆలయం, శ్రీ చంద్రమౌళీశ్వర స్వామి వారి ఆలయాలను పాలక మండలి ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి దంపతులు దసందర్శించారు.



# జర్మనీ వర్సిటీతో గీతం అవగాహనా ఒప్పందం

### అప్లైడ్ సెన్సెస్ లో పరస్పర సహకారం



సాగర్‌నగర్‌: ఆధునిక వ్యవసాయం, ఆహర ప్రాసెసింగ్ పరిశ్రమలు, నర్సింగ్ వృత్తి నైపుణ్యం, జియోమెటిక్స్, లాండ్‌స్కేప్ ఆర్కిటెక్చర్ వంటి అంశాలలో ప్రపంచంలో పేరుపొందిన జర్మనీకి చెందిన యూనివర్సిటీ ఆఫ్ అప్లైడ్ సెన్సెస్ న్యూబ్రాండెన్ బర్గ్‌తో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం శనివారం అవగాహనా ఒప్పందాన్ని కుదుర్చు కుంది. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె.శివరామకృష్ణ, ప్రో-వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె.శివప్రసాద్, గీతం సంయుక్త కార్యదర్శి ఎమ్.భరద్వాజ్‌ల సమక్షంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె.వి.జి.డి.బాలాజీ, జర్మనీ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డాక్టర్ ఇంగ్ ఆండ్రూస్ ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. ఈ అవగాహనా ఒప్పందంలో భాగంగా సంయుక్త సదస్సులు, పరిశోధనలు, సాంకేతిక పత్రాల ప్రచురణ, విద్యార్ధులు-అద్యాపకులను పరస్పరం ఆహ్వానించడం వంటివి చేస్తారు. ఈ సందర్భంగా గీతం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె.శివరామకృష్ణ మాట్లా డుతూ సాంకేతికంగా జర్మనీ ఎంతో ప్రగతిని సాధిస్తోందని గీతం అంతర్జాతీయ మేధో సహకారంలో భాగంగా న్యూబ్రాండెన్‌బర్గ్‌తో సంబంధాలను బలోపేతం చేసుకుంటామన్నారు. ఇప్పటికే రష్యా, అమెరికా, యుకె తదితర దేశాలలోని ప్రముఖ విశ్వవిద్యాలయాలతో తమకు అనుబంధం ఉందన్నారు. ఈ విధమైన పరస్పర సహకారం ద్వారా సాంకేతిక రంగంతో పాటు సామాజిక, వాణిజ్యరంగాలపై విద్యార్ధులకు అంతర్జాతీయ మార్పులపై అవగాహన ఏర్పడగలదన్నారు.

జర్మనీ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ ఇంగ్ ఆండ్రూస్ మాట్లాడుతూ తమ విశ్వవిద్యాలయంలో అత్యాధునిక ప్రయోగశాలలు గీతం విద్యార్ధులకు అద్యాపకులకు ఒప్పందంలో భాగంగా అందుబాటులో ఉంచుతామన్నారు. అండర్ గ్రాడ్యూయేట్ వరకు జర్మనీ భాషలో బోధన జరుగుతుందని, పిజి నుంచి ఆంగ్ల భాషలో బోధన ఉంటుందన్నారు. ఇప్పటికే భారతీయ విద్యార్ధులు పెద్ద సంఖ్యలో తమ విశ్వవిద్యాలయంలో ఉన్నారని తెలిపారు.భారత దేశంలోని విశ్వవిద్యాలయాలతో తమ అనుబంధం గీతంతో ప్రారంభం అయిందని వెల్లడించారు. కార్యక్రమంలో గీతం అంతర్జాతీయ విద్యార్ధి వ్యవహారాల విబాగం డైరక్టర్ కె.పి.కిషన్, కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగం అధిపతి ప్రొఫెసర్ కె.తమ్మిరెడ్డి, సివిల్ ఇంజనీరింగ్ విభాగం అధిపతి ప్రొఫెసర్ కె.వి.రమేష్, స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ సహాయి డైరక్టర్ కృష్ణ కాశీ తదితరులు పాల్గొన్నారు.

# రాజన్న ఆశయాలు నెరవేరుస్తాం

### పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

### తొట్లకొండ బౌద్ధక్షేత్రంలో మొక్కలు నాటిన విజయసాయిరెడ్డి





విశాఖపట్నం: విశాఖ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో శనివారం తొట్లకొండ బౌద్ధక్షేత్రంలో 'వనం-మనం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాజ్యసభ ఎంపీ విజయసాయిరెడ్డి బౌద్ధ కేంద్రాన్ని శుభ్రపరచి, మొక్కలు నాటారు.

అంతకుముందు విశాఖ బీచ్ రోడ్‌లో ఉన్న మాజీ సీఎం వైఎస్సార్ విగ్రహానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆశయాలను నెరవేర్చడమే మా లక్ష్యమని ఎంపీ విజయసాయిరెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు మోపిదేవి వెంకటరమణ, అవంతి శ్రీనివాస్, విశాఖ ఎంపీ ఎంవివి సత్యనారాయణ, విప్ బూడిద ముత్యాలనాయుడు, ఎమ్మెల్యేలు గుడివాడ అమర్‌నాధ్, కరణం ధర్మశ్రీ, భాగ్యలక్ష్మి, గొల్ల బాబురావు, ఉమాశంకర్ గణేశ్, విఎంఆర్డిఏ ఛైర్మన్ ద్రోణంరాజు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

**పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత**

భీమిలి మండలం కె నగరప్పాలెం పంచాయతీ తొట్లకొండ పైన శనివారం జరిగిన వనం మనం కార్యక్రమం లో రాజ్యసభ సభ్యులు వైఎస్ఆర్సిపి జాతీయ ప్రధాన కార్యదర్శి విజయసాయి రెడ్డి, సిపి రాజీవ్ కుమార్ మీనా ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విజయసాయి రెడ్డి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడుకోవల్సిన బాధ్యత ప్రతీ పౌరిడికి ఉందని అన్నారు. సిపి ఆర్కే మీనా మాట్లాడుతూ ఇప్పటికే విశాఖ జిల్లాలో 20 వేల మొక్కలు నాటాలని అదనంగా మరో 10 వేల మొక్కలు నాటడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమం లో మంత్రి మోపిదేవి వెంకటరమణ, విశాఖ ఎంపీ ఎం.వి.వి. సత్యనారాయణ, పశ్చిమ నియోజకవర్గ సమన్వయ కర్త మల్ల విజయప్రసాద్, వై సి పి.నగర అద్యక్షులు వంశీ కృష్ణ శ్రీనివాస్, ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె. రాజు తదితరులు పాల్గొన్నారు.

# రవాణా రంగంలో విశాఖ పోర్టుది అగ్రస్థానం

- కస్టమర్‌లకు ఎండ్ టూ ఎండ్ లాజిస్టిక్ సదుపాయం
- కార్గో హ్యాండ్లింగ్ పెరుగుదలపట్ల సంతృప్తి
- పోర్టు డిప్యూటీ ఛైర్మన్ పిఎల్ హరనాధ్



విశాఖపట్నం : 2019 ఆర్ధిక సంవత్సరం మొదటి నాలుగు నెలల్లో విశాఖపట్నం పోర్టు ట్రస్టు దేశంలోని అన్ని మేజర్ పోర్టులలో మూడవ స్థానంలో నిలిచింది. గత ఏడాది ఇదే సమయానికి పోర్టు నాలుగవ స్థానంలో నిలిచింది. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి జులై వరకూ నాలుగు నెలల్లో విశాఖపట్నం పోర్టు ట్రస్టు+ 23.70 మిలియన్ టన్నుల కార్గోను రవాణా చేసింది.

ఇదే గత ఏడాది 21.52 మిలియన్ టన్నుల కార్గోను రవాణా చేసింది. గత ఏడాదితో పోల్చుకుంటే ఇది 2.18 మిలియన్ టన్నులు అధికం. అన్ని మేజర్ పోర్టుల సరుకు రవాణాతో పోల్చుకుంటే ఇది 10 శాతం ఎక్కువ వృద్ధిని నమోదు చేసింది. విశాఖపట్నం పోర్టు ట్రస్టు సరుకు రావణాలో వృద్ధిని సాధించడంలో ఇనుప ఖనిజం, పెల్లెట్స్, కుకింగ్ కోల్, పెట్రోలియం ఉత్పత్తులు, కంటైనర్ కార్గో వంటివి ప్రముఖ పాత్ర పోషించాయి.

**గడచిన రెండేళ్లలో విశాఖపట్నం పోర్టు ట్రస్టులో చేపట్టిన ప్రధాన ప్రాజెక్టులు...**

ఇన్నర్ హార్బర్‌లో పనామాక్స్ సమార్థ్యం కలిగిన మూడు బెర్తుల నిర్మాణం (వెస్ట్ క్యూ 7, వెస్ట్ క్యూ 8, ఈక్యూ 2 టూ 5 బెర్తులు). ఆయిల్ రిఫైనరీ 3లో అదనపు ఆయిల్ హ్యాండ్లింగ్ సామర్ధ్యం పెంపుతో పాటు ఆయిల్ రిఫైనరీ 1, ఆయిల్ రిఫైనరీ 2 బెర్తుల అభివృద్ధి. 100 టి కెపాసిటీ కలిగిన హార్బర్ మొబైల్ క్రేన్ ఏర్పాటు. ఆర్ఎఫ్ ఐడీ గేటు నిర్వహణ.

వీటితో పాటు విశాఖపట్నం పోర్టు ట్రస్టు+ అధునాతన మార్కెంటింగ్ వ్యూహాలను అమలు చేయడం కోసం వ్యాపార అభివృద్ధి టీం ను ఏర్పాటు చేసుకుంది. కస్టమర్‌లకు ఎండ్ టూ ఎండ్ లాజిస్టిక్ సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకువచ్చింది. తమిళనాడు ఎలక్రికల్ డిపార్ట్‌మెంట్‌తో ఎండ్ టూ ఎండ్ లాజిస్టిక్ సదుపాయాన్ని కల్పిస్తూ ఎంవోయూను విశాఖపట్నం పోర్టు ట్రస్టు చేసుకుంది. ఇందులో భాగంగా విశాఖపట్నం పోర్టు ట్రస్టు మైన్‌ల వద్ద వ్యాగన్ లోడింగ్, కార్గో నిల్వ, షిప్పులలోకి లోడింగ్, రైల్వే వేగన్‌ల ఏర్పాటు వంటి సదుపాయాలను నిర్వహిస్తుం ది. ఇదే విధమైన లాజిస్టిక్ సదుపాయాలతో నేషనల్ మినరల్ డెవలప్ మెంట్ కాల్పొరేషన్‌తో నాగర్ నగర్ స్టీల్ ప్లాంట్‌కు బొగ్గు రవాణా చేయడానికి ఒప్పందం కుదుర్చుకోనుంది. ఇందుకు సంబంధించిన చర్చలు తుది దశలో ఉన్నాయి.

విశాఖపట్నం పోర్టు ట్రస్టు కార్గో హ్యాండ్లింగ్‌లో మూడో స్థానంలో నిలవడంపై పోర్టు డిప్యూటీ ఛైర్మన్ పిఎల్ హరనాధ్ పోర్టు ఉద్యోగులను స్టీవ్ డోర్స్‌ను పిపిపి ఆపరేటర్లను, షిప్పింగ్ ఏజెంట్లను ప్రసంసించారు.

పక్కనే ప్రైవేటు పోర్టు ఉన్నప్పటికీ కార్గో హ్యాండ్లింగ్‌లో పెరుగుదలను నమోదు చేయడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. భవిష్యత్తులో మూడో స్థానాన్ని నిలబెట్టుకుంటామని ఆయన వెల్లడించారు.

ఈ ఏడాది చివరికి పోర్టు+ 70 మిలియన్ టన్నుల కార్గో హ్యాండ్లింగ్ చేస్తుందని

# అధికారం నుంచి దించినా అహంకారం తగ్గలేదు

- బందర్‌పోర్టుపై అసత్యప్రచారం తగదు
- రాష్ట్ర రవాణా, సమాచార శాఖమంత్రి శ్రీ పేర్నినాని



విజయవాడః బందర్ పోర్టు గురించి తెలంగాణాకు ఇచ్చేస్తున్నామని అసత్యప్రచారాలు చేస్తున్నారు. ఐదేళ్లుగా మచిలీపట్నంను చంద్రబాబు నిర్లక్ష్యం చేశారు. చంద్రబాబు వేసిన శంఖుస్థాపన రాయి తప్ప మరోటి లేదు. జగన్ గురించి మాట్లాడే అర్హత మీకు లేదు. రహస్య జిఓలు అంటూ జిఓలు డౌన్ లోడ్ చేయడం రాని లోకేష్ లాంటి వాళ్లు దుష్ప్రచారం చేస్తున్నారు. పండితపుత్ర లోకేష్ వాస్తవాలు తెలుసుకుని మాట్లాడు. ఎవరో రాసిచ్చినవి ట్విట్టర్లో పెట్టడం కాదు. బందర్ పోర్ట్ పనులు నవయుగ కంపెనీ చేయకపోతే పనులు మేమే చేపడతాం. ప్రజల ఆస్థులు తాకట్టు పెట్టడానికి ఇది చంద్రబాబు ప్రభుత్వం కాదు. చంద్రబాబు, లోకేష్ లు పబ్లిసిటికోసం దిగజారి ప్రవర్తిస్తున్నారు. వయస్సుపెరిగే కొద్దిచంద్రబాబు ఆలోచన పరిజ్ఞానం మసకబారుతోంది. ట్విట్టర్ వేదికగా తప్పుడు ప్రచారాలు చేస్తున్నారు. వైయస్ జగన్ గురించి మాట్లాడేటప్పుడు దేవినేని ఉమాలాంటివాళ్లు నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడండి. దేవినేని ఉమకు పదవి పోయినా మదం దిగలేదు. అధికారం ఉన్నప్పుడు మదమెక్కి మాట్లాడుతున్నారనుకున్నాం. ప్రజలు అధికారం నుంచి దించినా అహంకారం తగ్గలేదు. మేం అలా మాట్లాడగలం కాని సంస్కారం ఉంది. రాజకీయాల కోసం చంద్రబాబు బరితెగించి వ్యవహరిస్తున్నారు. మనకున్న హక్కుల్ని కేసిఆర్ అమ్మేసి కేసుల భయంతో తండ్రికొడుకులు హైద్రాబాద్ నుంచి పారిపోయి వచ్చారు.






Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of VIJAYABHANU PUBLICATIONS PVT. LTD., Published and Printed at VIJAYABHANU PRESS, D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ☆ Phone : 2564353, Fax : 0891-2569004 ☆ e-mail: vijayabhanudaily@gmail.com

ఆశాభావం వ్యక్తం చేశారు.